సూర్య www.suryaa.com 19వ వసంతంలోకి ...
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com
శనివారం | 25 అక్టోబర్ 2025 | విజయవాడ
సంపుటి 19 | సంచిక 4
| పేజీలు 8+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...


☞ APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
☞ నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
☞ కరెంట్ అఫైర్స్
☞ నమూనా ప్రశ్నాపత్రాలు
☞ విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - వర్ష ఋతువు, బహుళ పక్షం, కార్తీక మాసం చవితి రా.12.01 వరకు, జ్యేష్ట పూర్తి, వర్జ్యం మ.12.02 నుంచి 1.48 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.5.55 నుంచి 7.28 వరకు

### అన్ని ఎన్నికల రికార్డులను
# తుడిచేస్తాం
## బీహార్‌లో ఎన్‌డిఏ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ప్రధాని

- నీతీశ్ కుమార్ సారథ్యంలో మరోమారు ఎన్‌డీఏ సర్కారు ఏర్పాటు ఖాయం
- ఫోన్లలోని టార్చ్ లైట్లను ఆన్ చేసి మద్దతు తెలపమన్న ప్రధానమంత్రి
- ఆధునిక గాడ్జెట్లు వచ్చాయ్..., ఇక లాంతర్లు అక్కర్లేదంటూ ఆర్‌జేడీపై వ్యాఖ్యలు
- బెయిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తులు నాయకత్వం వహిస్తున్న కూటమి మనకెందుకు
- మావోల పీచమణిచేందుకు చేస్తున్న కృషి ఫలిస్తోంది
- సమస్తిపూర్‌లో కర్పూరీ ఠాకూర్‌కు ప్రధాని నివాళులు



6 లో

### ఆర్జేడీతో చేతులు కలపడం నా పొరపాటే

- ప్రధాని ర్యాలీలో నితీశ్ కీలక వ్యాఖ్యలు
- సమస్తిపూర్ జిల్లాలో విపక్ష పార్టీపై ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ విమర్శలు



6 లో




# కాళ రాత్రి మృత్యుప్రయాణం

## 20 మంది అగ్నికి ఆహుతి... 19 మంది క్షతగాత్రులు

- బైక్ ఢీకొనటమే ఘటనకు కారణమంటున్న సాక్షులు
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ఏపీ మంత్రులు
- దుర్ఘటనపై ఏపీ సీఎం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- కర్నాటక, తెలంగాణ మంత్రులతో సమన్వయం చేసుకుంటున్నామన్న హోమ్‌మంత్రి అనిత
- బాధితులకు నష్టపరిహారం ప్రకటించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి



వివరాలు లోపలి పేజీల్లో

### అడవులు జాతి సంపద ప్రతి
# అంగుళం అమూల్యం

- అడవుల ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించం
- శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు చల్లించేందుకు ప్రణాళిక
- దేశ అవసరాలకు తగిన కలప రాష్ట్రం నుంచి అందిద్దాం
- ఎకో టూరిజం ప్రోత్సాహంతో గిరిజన యువతకు ఉపాధి
- అటవీ శాఖను ఆదాయార్జన శాఖగా తయారు చేయాలి
- రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల వర్క్ షాప్‌లో ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్



2 లో

### కర్నూలు బస్సు ప్రమాదంపై
## రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి




3 లో

### బాధితులకు పరిహారం ప్రకటన

ఆంధ్రప్రదేశ్లోని కర్నూలు జిల్లా సరిహద్దులో ఊహించని ఈ ఘోర దుర్ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. అయితే తాజాగా ఈ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అంతేకాకుండా బాధితులకు పరిహారాన్ని కూడా ప్రకటించారు. కర్నూలు జిల్లాలో సంభవించిన ఈ రోడ్డు ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

### యుఏఈ దేశాల నుంచి
# ఏపీకి ప్రోత్సాహం

- సిలికాన్ ఒయాసియా మధ్య కొత్త భాగస్వామ్యాల ఏర్పాటు
- భారత్-యూఏఈ దేశాలు నాలెడ్జ్ ఎకానమీపై దృష్టి
- తెలుగు ప్రజలతో సీఎం సమావేశం
- పాలన, పౌర సేవలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరింత మెరుగైన సేవలు



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం దుబాయ్‌లో యూఏఈ ఆర్థిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీతో భేటీ అయ్యారు. యూఏఈ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వాణిజ్య బంధం పెంచుకునే అంశంపై ఇరువురు నేతల మధ్య చర్చ జరిగింది. ప్రస్తుతం భారత్-యూఏఈ దేశాలు నాలెడ్జ్ ఎకానమీపై దృష్టి పెట్టే అంశంపై ఇరువురు నేతలు చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాలన, పౌరసేవలను మరింత మెరుగ్గా అందించే అంశంపై భేటీలో మాట్లాడారు. సాంకేతికంగా పౌరసేవలు, పాలనా అంశాల్లోని అత్యుత్తమ విధానాలను ఆర్టీజీఎస్ ద్వారా ఇచ్చిపుచ్చుకునే అంశంపై యూఏఈ ఆర్థిక శాఖ మంత్రి వివరించారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### 2047నాటికి గ్లోబల్ ఎకనమిక్
# పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్

- 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా వేగంగా అడుగులు
- జనవరి నుంచి అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సేవలు
- ఆస్ట్రేడ్ ఎగ్జిక్యూటివ్స్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్



2 లో

ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం. సాంకేతిక ఆవిష్కరణలు, సుస్థిరమైన సమగ్రాభివృద్ధి ద్వారా ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే తమ సంకల్పమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మెల్బోర్న్ లో ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ ఎగ్జిక్యూటివ్‌లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్ ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ప్రజాప్రయోజన ప్రకటన
ఆహార పరిరక్షణ, ప్రమాణాల అమలు విభాగం
fssai
Eat Right India
పుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా - ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం


కొవ్వును తగ్గించుకోండి
మీ ఆహారంలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోండి. అధిక కొవ్వు పదార్థాల వాడకాన్ని తగ్గించండి. అలాగే మీ ఆహారంలో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు ఉన్నటువంటి వాల్ నట్స్ (అక్రోట్), అవిశె గింజలు వంటి వాటిని చేర్చుకోండి.


లీన్ ప్రోటీన్ ఉత్పత్తులను ఎంచుకోండి
రెడ్ మీట్, ప్రాసెస్డ్ మీట్ స్థానంలో అధిక ప్రోటీన్, తక్కువ కొవ్వు ఉండే స్కిన్ లెస్ కోడి మాంసం, చేపలు, పప్పుధాన్యాలు, సోయా పనీర్ మరియు తక్కువ కొవ్వు కలిగిన పాల ఉత్పత్తులు వంటి లీన్ ప్రోటీన్ ఉత్పత్తులను తినండి.


పీచు పదార్థాలను తీసుకోండి
ఆహారంలో పీచు పదార్థాలను ఎక్కువగా చేర్చుకొనుటకు పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినండి.




ఫుడ్ లేబుళ్లపై ఉన్న వివరాలు చదవాలి!
ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు కొంటున్నారా? అయితే వాటి లేబుళ్లపై ముద్రించిన కొవ్వు పదార్థాల వివరాల గురించి చదవండి. వీలైనంత వరకు తక్కువ కొవ్వు లేదా కొవ్వు రహిత పదార్థాలను ఉపయోగించండి.

ఊబకాయాన్ని ఆపండి/అధిక బరువును తగ్గించుకోండి


సలహాలు, ఫిర్యాదుల కోసం సంప్రదించండి
సంచాలకులు 08645 241 0295
జాయింట్ ఫుడ్ కంట్రోలర్ 94403 79755

జారీ చేసినవారు : ఆహారభద్రత కమీషనర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



"మీ ప్రేరణను మరియు మీ ఊహను అణచివేయకండిబి మీ నమూనాకు బానిసగా మారకండి."

- విన్సెంట్ వాన్ గోహ్



"మీ ఊహా దృష్టి మసకబారినప్పుడు మీరు మీ కళ్ళపై ఆధారపడలేరు."

- మార్క్ ట్వైన్



"ఒక ఊహా అంటే సృజనాత్మకత మీకు ఏదైనా చెప్పడానికి ప్రయత్నిస్తుంది."

- ఫ్రాంక్ కాప్రా



# యుఏఈ దేశాల నుంచి ఏపీకి ప్రోత్సాహం

● సిలికాన్ ఒయాసియా మధ్య కొత్త భాగస్వామ్యాల ఏర్పాటు ● భారత్- యూఏఈ దేశాలు నాలెడ్జ్ ఎకానమీపై దృష్టి ● తెలుగు ప్రజలతో సీఎం సమావేశం ● పాలన, పౌరసేవలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరింత మెరుగైన సేవలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం దుబాయ్‌లో యూఏఈ ఆర్థిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీతో భేటీ అయ్యారు. యూఏఈ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వాణిజ్య బంధం పెంచుకునే అంశంపై ఇరువురు నేతల మధ్య చర్చ జరిగింది. ప్రస్తుతం భారత్– యూఏఈ దేశాలు నాలెడ్జ్ ఎకానమీపై దృష్టి పెట్టే అంశంపై ఇరువురు నేతలు చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాలన, పౌరసేవలను మరింత మెరుగ్గా అందించే అంశంపై భేటీలో మాట్లాడారు. సాంకేతికంగా పౌరసేవలు, పాలనా అంశాల్లోని అత్యుత్తమ విధానాలను ఆర్టీజీఎస్ ద్వారా ఇచ్చిపుచ్చుకునే అంశంపై యూఏఈ ఆర్థిక శాఖ మంత్రి వివరించారు. స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలకు నిధులు ఇవ్వటం ద్వారా ఏపీని నాలెడ్జ్ ఎకానమీగా ప్రోత్సహించే అంశంలో దుబాయ్ సిలికాన్ ఓయాసియా తీసుకున్న చర్యలపైనా సమావేశంలో ఇరువురు నేతలు మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్– దుబాయ్ సిలికాన్ ఒయాసియా మధ్య కొత్త భాగస్వామ్యాలను ఏర్పాటు చేసే అంశంపై అంగీకారం తెలిపారు. ఆహార భద్రత అంశంపై ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పనిచేసేందుకు, కొత్త అవకాశాలను అన్వేషించే అంశాన్ని ప్రస్తావించారు యూఏఈ ఆర్థిక వ్యవహారాల మంత్రి. లాజిస్టిక్స్, రవాణా, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు, నూతన భాగస్వామ్యాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు, యూఏఈ ఆర్థిక వ్యవహారాల మంత్రి చర్చించారు. అలాగే సాంకేతికంగా పౌరసేవలు, పాలనా అంశాల్లోని అత్యుత్తమ విధానాలను ఆర్టీజీఎస్ ద్వారా ఇచ్చిపుచ్చుకునే అంశంపై చర్చించిన యూఏఈ ఆర్థిక శాఖ మంత్రి తో స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలకు నిధులు ఇవ్వటం ద్వారా ఈ ప్రాంతాన్ని నాలెడ్జ్ ఎకానమీగా ప్రోత్సహించే అంశంలో దుబాయ్ సిలికాన్ ఓయాసియా తీసుకున్న చర్యలపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్– దుబాయ్ సిలికాన్ ఒయాసియా మధ్య కొత్త భాగస్వామ్యాలను ఏర్పాటు చేసే అంశంపై అంగీకారం తెలిపారు. ఆహార భద్రత అంశంపై ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పనిచేసేందుకు, కొత్త అవకాశాలను అన్వేషించే అంశంతో పాటు లాజిస్టిక్స్, రవాణా, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు, నూతన భాగస్వామ్యాల ఏర్పాటుపై చర్చించిన సీఎం చంద్రబాబు, యూఏఈ ఆర్థిక వ్యవహారాల మంత్రి.నడుమ చర్చ జరిగింది. అలాగే చివరిరోజు గల్ఫ్ దేశాల్లోని తెలుగు ప్రజలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. దుబాయ్ లోని లీ మెరిడియన్ హోటల్ లో జరిగిన తెలుగు డయాస్పోరా సమావేశం లోలి ఏపీ ఎన్నార్టీ సమన్వయంతో గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలుగు వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు చేసుకోవటం విశేషం. యూఏఈ లోని కువైట్, సౌదీ అరేబియా, ఒమన్, ఖతార్, బహ్రెయిన్ దేశాల నుంచి కూడా కార్యక్రమానికి తెలుగు ప్రజలు హాజరై చంద్రబాబు తో సంభాషించారు. ఈలికార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... తెలుగు జాతికి తిరుగే లేదు. ప్రపంచంలో తెలుగు జాతి నెంబర్ 1 గా తయారవుతుంది దన్నారు. ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా తెలుగు ప్రజలు ఉన్నతస్థాయిలో ఉండాలని ఆకాంక్షించాను అందుకే 30 ఏళ్ల ముందు ఐటీని ప్రోత్సహించాను. తెలుగు వాళ్లు ఐటీ నిపుణులుగా ఇప్పుడు ప్రపంచం అంతా రాణిస్తున్నారన్నారు. సత్యనాదెళ్ల లాంటి తెలుగు వాళ్లు మైక్రోసాఫ్ట్ కంపెనీ సీఈఓగా ఉంటం గర్వకారణమన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి కోసం ప్రవాసాంధ్రులంతా తపించి గెలిపించడం వల్లే రాష్ట్రంలో చకచక అభివృద్ధి జరుగుతోందన్నారు. గల్ఫ్ దేశాల నుంచి మీరు తరలివచ్చి తెలుగు డయాస్పోరాకు హాజరు కావటం ఆనందాన్ని కలిగిస్తోంది అబుదాబీ, దుబాయ్ ఆయిల్ ఎకానమీ నుంచి పర్యాటకం, నాలెడ్జి ఎకానమీ దిశగా నడుస్తున్నాయి 1.50 లక్షల హోటల్ రూములతో ఆతిథ్య రంగానికి పెద్ద ఎత్తున ఆదాయాన్ని ఆర్జించి పెడుతోంది గతంలో హైదరాబాద్ కు మైక్రోసాఫ్ట్ తీసుకువస్తే ఇప్పుడు ఏపీలోని విశాఖకు గూగుల్ తీసుకువస్తున్నాం అని అన్నారు. దేశంలో క్వాంటం వ్యాలీ ఉండే ఏకైక ప్రాంతం కూడా ఆంధ్రప్రదేశ్ మాత్రమే. ప్రతీ ఇంటికీ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసి లక్ష్యాన్ని సాధిస్తాం అన్నారు. ఐటీ, కమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకుంటున్నాం.

# అడవులు జాతి సంపద... ప్రతి అంగుళం అమూల్యం

● అడవుల ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించం ● శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు చల్లించేందుకు ప్రణాళిక ● దేశ అవసరాలకు తగిన కలప రాష్ట్రం నుంచి అందిద్దాం ● ఎకో టూరిజం ప్రోత్సాహంతో గిరిజన యువతకు ఉపాధి ● అటవీ శాఖను ఆదాయార్జన శాఖగా తయారు చేయాలి ● రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల వర్క్ షాప్‌లో ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : 'అడవులు జాతీయ ఆస్తి. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. అడవుల రక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. అడవులను రక్షించుకునే విషయంలో రాజకీయలకు తావుండదు. రాజీకి తావుండదు. అడవులు జాతి సంపద, ప్రతి అంగుళం అమూల్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడవుల రక్షణ విషయంలో మార్గదర్శకం చేస్తున్నారు. అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు కూడా అటవీ భూములను రక్షించే విషయంలో పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళ్లాల'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ మంత్రిగా ఉన్న వ్యక్తే తన సొంత ఇలాకాలోని అటవీ భూములను ఇష్టానుసారం ఆక్రమించుకుంటే, అప్పటి వ్యవస్థలో అధికారులు ఎందుకు మిన్నకుండిపోయారో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. అలాంటి తప్పిదాలు కూటమి ప్రభుత్వంలో జరగడానికి వీల్లేదని, పార్టీలు, వ్యక్తులకు అతీతంగా అటవీ భూమి అంగుళం కబ్జా అయినా వేగంగా స్పందించాల్సిన బాధ్యతను అటవీ అధికారులు తీసుకోవాలని చెప్పారు. కృష్ణా జిల్లా కొండపావులూరులోని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆవరణలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల రెండు రోజుల వర్క్ షాప్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అడవుల సంరక్షణ, భవిష్యత్తు లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "అటవీ శాఖలో విభిన్నమైన బాధ్యతలు పంచుకోవడానికి సరిపడినంత సిబ్బంది లేరని ప్రతి సమీక్షలోనూ అధికారులు నా దృష్టికి తీసుకువస్తున్నారు. ఈ సమస్య అధిగమించడానికి ఉన్న మార్గాలను కేబినెట్ ముందు ఉంచాం. సిబ్బంది నియామకం వ్యవహారంలో పూర్తి స్థాయి పారదర్శకత పాటించాలి. ఎలాంటి సిఫార్సులకు తావివ్వవద్దు. అడవుల్ని సంరక్షించాలంటే అటవీ శాఖ అధికారుల భద్రత ప్రధానమైనది. అటవీ సిబ్బంది భద్రత పట్ల కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి స్పష్టతతో ఉంది. విధి నిర్వహణలో ఉన్న అధికారులను ఇబ్బందిపెట్టినా, దాడులకు పాల్పడినా అది ఏ స్థాయి వ్యక్తులైనా వారిని ఉపేక్షించం. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. విధి నిర్వహణలో ఇబ్బందులు ఉంటే వ్యక్తిగతంగా నన్ను కలిసి సమస్యను చెప్పండి. శ్రీశైలం ఘటన నా దృష్టికి వచ్చిన వెంటనే నిజానిజాలు తెలుసుకున్నాను. సిబ్బందికి తగిన న్యాయం జరిగేలా చూశాం. విధి నిర్వహణ విషయంలో ఎలాంటి భయాలకు తావివ్వవద్దు. రాష్ట్రవ్యాప్తంగా 22 శాతం భూ భాగంలో నోటిఫై చేసిన అడవులు ఉన్నాయి. డి–నోటిఫై చేసిన దానితో కలిపితే మొత్తం 31 శాతంగా ఉండవచ్చు అని అంచనా. అయితే ఉన్న అడవుల్లో ఎంత పచ్చదనం ఉంది? ఆక్రమణల నేపథ్యంలో ఎంత శాతం అడవులు మిగిలాయి అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీనిపై సమగ్ర సర్వే చేసి ఇతర శాఖలను సమన్వయం చేసుకుని అటవీ భూములను స్వాధీనం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలి. ఆక్రమణలు ఎక్కడ ఉన్నా, చేసింది ఎవరైనా ఉపేక్షించవద్దు. 2047 నాటికి రాష్ట్ర భూ భాగంలో 50 శాతం పచ్చదనంతో నిండేలా పని చేయాలి. దీనికి ప్రజల భాగస్వామ్యం అవసరం. భావితరాలకు పచ్చదనాన్ని పెంపొందించేలా చైతన్యవంతులను చేస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలం.

**గ్రేట్ గ్రీన్‌వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్... గొప్ప ప్రయత్నం**

974 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం మనది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు తీర ప్రాంత రక్షణకు మడ అడవుల పెంపకం ప్రధానం. తీరం వెంబడి ఖాళీ ప్రదేశాల్లో తాటి చెట్లు, పాల్మిరా, పాడనస్ వంటి తీర ప్రాంత జాతుల మొక్కలు పునరుద్దరణపై దృష్టి సారించి ఆకు పచ్చని గోడ నిర్మాణానికి కాల వ్యవధి పెట్టుకుని పని చేద్దాం.

# కర్నూలు ఘోర బస్సు ప్రమాదంపై సీఎం తీవ్ర దిగ్భ్రాంతి

● దుబాయ్ నుండి టెలీకాన్ఫరెన్సు నిర్వహించి తక్షణ సహాయ చర్యలు తీసుకోవాలని ఆదేశం ● సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న హోం మంత్రి అనిత, డిజిపి మరియు జిల్లా కలెక్టర్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నేటి తెల్లవారు జామున కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద ఘోర అగ్ని ప్రమాదానికి గురై పలువురు మరణించడం, మరికొంత మంది తీవ్రగాయాలు పాలు కావడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. దుబాయ్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ నుండే రాష్ట్ర అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హోంమంత్రి, రవాణా శాఖ మంత్రి, సీఎస్, డీజీపీ, స్థానిక డీఐజీ, జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులు మరియు బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని, మృతుల సంఖ్య పెరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని, మృతదేహాలను గుర్తించి కుటుంబాలకు అప్పగించాలని సూచించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలంటూ సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లిన రవాణా శాఖ మంత్రి**

బస్సు ఘోర ప్రమాద ఘటనపై వెంటనే స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేసిన ఆయన, ఈ ఘటన హృదయ విదారకమని పేర్కొన్నారు. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని రవాణా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని రకాలుగా భద్రతా ప్రమాణాలు ఉండేలా చర్యలు చేపట్టాలని రవాణా శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, అధికా రులతో సమన్వయం చేసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. మృతుల వివరాలు త్వరగా గుర్తించి వారి కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని సూచించారన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా వైద్యశాఖకు సూచనలు జారీ చేశారన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలు కఠినంగా నిర్వహించాలని, అన్ని జిల్లాల్లో సాంకేతిక తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖను ఆదేశించారు. ప్రమాదానికి నిర్లక్ష్యం కారణమై ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యత అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజల ప్రాణ భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు.

**బాదిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోం శాఖ మంత్రి హామీ**

రాష్ట్ర హోం మరియు విపత్తుల శాఖ మంత్రి వంగలపూడి అనిత కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు దగ్ధమైన ఘటనలో పలువురు మృతి చెందడంపై ఆమె తీవ్ర విచారం తెలిపారు. క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇలాంటి దుర్ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న హోం మంత్రి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, వారికి అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేసిన వ్యవసాయ శాఖ మంత్రి**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బస్సు ఘోర అగ్నిప్రమాదంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని, గాయపడిన వారికి అత్యు త్తమ వైద్యం అందించాల్సిందని అధికా రులు ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు సంతా పం తెలియజేయగా, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రయా ణికులు సురక్షితంగా ప్రయాణించే విధంగా తగు భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.



**దుబాయ్ పర్యటనలోనున్న రహదారులు భవనాల శాఖ మంత్రి తీవ్ర విచార వ్యక్తం..**

కర్నూలు జిల్లాలో బస్సు పూర్తిగా దగ్ధమైన ఘటనపై దుబాయ్ పర్యటనలోనున్న రాష్ట్ర రహదారులు %డ% భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్ధన రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచే జిల్లా అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు తక్షణ మరియు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైతే వారిని హైదరాబాద్‌కు తరలించాలని మంత్రి ఆదేశించారు. అనేక మంది ప్రయాణికులు సజీవదహనమైన వార్త తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ, ఇలాంటి దుర్ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఆరోగ్య శాఖ మంత్రి..**

కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదంపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి ఆదేశాలు జారీ చేశారు. బస్సులోనే భౌతిక అవశేషాలు ఉన్నందున, అవసరమైతే ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఫోరెన్సిక్ వైద్యులను ఘటన స్థలానికి పంపించి, మృతులను గుర్తించేందుకు డీఎన్ఏ నమూనాలు సేకరించాలని ఆదేశించారు. మృతదేహాల తరలింపుకు మహాప్రస్థానం వాహనాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో 12 మంది ఆసుపత్రిలో చేరగా, ప్రాథమిక చికిత్స అనంతరం వారిలో ఆరుగురు డిశ్చార్జ్ అయ్యారని, ఒకరి పరిస్థితి నిలకడగానే ఉందని మంత్రి సత్యకుమార్ వివరించారు.

**బస్సు ఘోర ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ జరపాలన్నమంత్రి ఫరూఖ్**

రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో ప్రయాణికులు సజీవదహనం కావడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న ఆయన, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదం నుంచి బయటపడ్డ ప్రయాణికులకు అవసరమైన వైద్య సేవలు తక్షణం అందించాలని కర్నూలు జిల్లా అధికారులను ఆదేశించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని మంత్రి ఫరూక్ సూచించారు.

**రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి**

రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కర్నూలు బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడ్డ వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందజేయాలని సూచించారు.

**తక్షణ సహాయక చర్యలు చేపట్టిన కర్నూలు జిల్లా యంత్రాంగం**

కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద బాదితులను ఆదుకునేందుకు కర్నూలు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టింది. ప్రమాద స్థలానికి జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తక్షణమే జరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న కావేరి బస్సులో సుమారు 41 మంది ప్రయాణికులు ఉన్నారని, నేటి తెల్లవారుజామున 3 నుంచి 3:10 గంటల సమయంలో బస్సు ఒక బైక్‌ను ఢీకొనడం వల్ల ఇంధనం లీక్ అయి ప్రమాదం సంభవించిందని తెలిపారు. ఈ ఘటనలో 21 మంది సురక్షితంగా ఉన్నారని, మిగిలిన 20 మందిలో 11 మంది మృతదేహాలను గుర్తించగా, మిగిలిన వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది అని ఆమె తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు పలు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 08518–277305, కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంట్రోల్ రూమ్ 9121101059, ఘటనాస్థలి కంట్రోల్ రూమ్ 9121101061, కర్నూలు పోలీస్ ఆఫీసు కంట్రోల్ రూమ్ 9121101075గా ప్రకటించడం జరిగిందన్నారు. అదనంగా, ఆస్పత్రి హెల్ప్‌డెస్క్ నంబర్లు 9494609814 మరియు 9052951010 ద్వారా కూడా బాధితుల కుటుంబాలు సమాచారం కోసం సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

### 2047నాటికి గ్లోబల్ ఎకనమిక్

# పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్!



ఆస్ట్రేలియా (మెల్బోర్న్): ఆంధ్రప్రదేశ్ ను 2047 నాటికి గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్ గా మార్చడమే మా లక్ష్యం. సాంకేతిక ఆవిష్కరణలు, సుస్థిరమైన సమగ్రాభివృద్ధి ద్వారా ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే తమ సంకల్పమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మెల్బోర్న్ లో ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ (%ూబర్‌తీఉవ%) ఎగ్జిక్యూటివ్ లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్ ప్రసంగించారు. ఈ సమావేశానికి ఆస్ట్రేడ్ అంతర్జాతీయ విద్య, వాణిజ్య సేవా నైపుణ్యం, డిజిటల్ డెలివరీ విభాగాధిపతి శ్రీమతి ఎలోడీ జర్నెట్ అధ్యక్షత వహించగా, లోకేష్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా శరవేగంగా దూసుకుపోతోంది, గత 16నెలల్లోనే %వి%117 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాం. సుదీర్ఘమైన పాలనానుభవం, సమర్థవంతమైన దార్శనిక నాయకుడి వల్లే ఇది సాధ్యమైంది. ఏరోస్పేస్ %డ% డిఫెన్స్, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, డీప్‌టెక్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, లాజిస్టిక్స్, పోర్టులు, ఫార్మా, బయోటెక్నాలజీ, టూరిజం వంటి రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో విశేష పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. బలమైన విధాన వ్యవస్థ, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, మూడు ఆర్థిక కారిడార్లు, భవిష్యత్ సిద్ధమైన శ్రామిక శక్తి, క్వాంటం కంప్యూటింగ్, డీప్‌టెక్, గ్రీన్ ఎనర్జీ వ్యాలీ వంటి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మూలస్తంభాలుగా ఉన్నాయి. అధునాతన సాంకేతికత, ఏఐ ఆధారిత గవర్నెన్స్ వేగవంతమైన అభివృద్ధికి దన్నుగా నిలుస్తున్నాయి. అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ 4.0తో పాటు 24 థీమెటిక్ పాలసీలను ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఏఐ వంటి అధునాతన సాంకేతిక రంగంతోపాటు డ్రోన్లు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. 1053 కి.మీ.ల సువిశాల తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం 6 ఆపరేషనల్ పోర్టుల ద్వారా ఏటా 193 మిలియన్ మెట్రిక్ టన్నులు సరుకు రవాణా అవుతోంది. వచ్చే ఏడాదికల్లా 350 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మరో 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ప్రారంభం కానున్నాయి. తూర్పు తీర సముద్ర కార్గో రవాణాలో 40శాతం ఏపీ నుంచే సాగుతోంది. ప్రస్తుతం %వి%20 బిలియన్లుగా ఉన్న ఎగుమతులను 2047 నాటికి 450 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. విశాఖపట్నం ఐటీ, ఇన్నోవేషన్, డేటా హబ్‌గా తయారవుతోంది. విశాఖలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏఐ హబ్ నిర్మించబోతోంది. అదేవిధంగా ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1.35లక్షల కోట్లతో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయబోతోంది. భారీ పెట్టుబడులకు విశాఖపట్నం గేట్ వేగా మారింది. విశాఖ మహానగరం 2047 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధిస్తుంది. ఏపీ రాజధాని అమరావతిలో జనవరి నుంచి దక్షిణాసియాలోనే తొలి 156–క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ సేవలు ప్రారంభించబోతున్నాం.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రైవేటు బస్సు అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంటుకు చరవాణి ద్వారా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలిసి వేసింది అన్నారు. ఫోరెన్సిక్ వైద్యులు ఘటన స్థలానికి వెళ్లారని, ప్రమాద సంఘటనపై విచారణ జరిపిస్తామన్నారు. భౌతిక కాయాల తరలింపునకు మహాప్రస్తానం వాహనాలు కూడా సిద్ధంగా ఉన్నాయని, చనిపోయిన వారిని గుర్తించేందుకు డీఎన్ఏ నమూనాలు కూడా సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి సుభాష్ తెలిపారు.

## నా మనసును కలచి వేసింది



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో జరిగిన ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కర్నూలు బస్సు ప్రమాదం మనసును కలచివేసింది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో 20 మందికి పైగా మృతి చెందడం దురదృష్టకరం, బాధాకరం అన్నారు. ప్రమాదంలో గాయపడ్డవాళ్లు త్వరగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థించారు. ప్రమాదానికి కారణాలపై విచారణ చేస్తున్నామని, దోషులను కఠినంగా శిక్షిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ట్రావెల్స్ బస్సుల యజమానులు బస్సు ఫిట్ నెస్, సేఫ్టీ, పర్మిట్ తదితర నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల భద్రతే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

### తుఫానులొస్తున్నాయ్...

# అప్రమత్తంగా ఉండండి

ఏపీ స్టేట్ క్రైమ్ బ్యూరో, మేజర్ న్యూస్, అక్టోబర్ 24 : రాష్ట్రంలో తుఫాను పరిస్థితి పై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా రాష్ట్ర కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఆమె సంబంధిత అధికారులతో రాష్ట్రంలోని తుఫాను పరిస్థితులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం తుఫానుగా బలపడనున్న నేపథ్యంలో సమీక్షను చేపట్టారు. అల్పపీడనం సోమవారంకు తుపాను గా బలపం పడటంతో అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం దానిని దీటుగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఈడీ దీపక్, అధికారులతో హోంమంత్రి వంగలపూడి అనిత సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అల్పపీడనం నైరుతి,పశ్చిమ–మధ్య బంగాళాఖాతంలో సోమవారంకు తుపానుగా బలపడుతుందని ఎండీ ప్రఖర్ జైన్ ఆమెకు తెలిపారు. రాష్ట్రానికి రేపు భారీ, ఎల్లుండి అతిభారీ, సోమ,మంగళవారాల్లో అత్యంత భారీ వర్ష సూచన ఉందని అధికారులు వివరించారు. తుపాను తీవ్రతను అంచనా వేసి ప్రభావిత జిల్లాలని అలెర్ట్ చేయాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు, ప్రజలకు తెలియజేయాలన్నారు. సహయక చర్యలకు బృందాలు పంపించండి అని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం మరింత అలెర్ట్ గా ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి 24/7 కొనసాగించాలన్నారు. సోషల్ మీడియాలోని వదంతులు నమ్మవద్దు అని సూచించారు. విపత్తుల సంస్థ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రందించాలన్నారు. శిధిలావస్థలో ఉన్న ఇళ్ళల్లో ఉండే వారిని గుర్తించి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అవసరమైతే ప్రజలను సహాయక శిబిరాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

## విష వాయువుల కోరల్లో ఢిల్లీ!

దేశ రాజధాని ఢిల్లీ గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ప్రతి సంవత్సరం శీతాకాలంలో ఒక విషాదకరమైన ఆనవాయితీగా మారుతోంది. ఈ విపరీతమైన గాలి ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఈ భయంకరమైన పరిస్థితిని అధిగమించడానికి, వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి తొలిసారిగా మేఘ బీజాలు చల్లడం అనే పద్ధతి ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపించేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధ మైంది. ఈ అసాధారణ చర్య, ఢిల్లీలో కాలుష్యం ఎంతటి అసాధారణ స్థితికి చేరుకుందో స్పష్టం చేస్తోంది. ఈ వారం ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ చాలాసార్లు 400 మార్కును దాటి, అత్యంత తీవ్రమైన లేదా ప్రమాదకరమైన కేటగిరీకి చేరుకుంటుంది. ఈ కలుషితమైన గాలిని పీల్చడం రోజుకు పదికి పైగా సిగరెట్లు తాగడంతో సమానం అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న ధూళి కణాలు ఊపిరితిత్తులు, రక్తంలోకి సులువుగా చేరి ఆస్తమా, శ్వాసకోశ సమస్యలను, గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతున్నాయి. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కఠినమైన చర్యల ప్రణాళికలను అమలు చేయాల్సి వస్తోంది. భారతదేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య సమస్య ఒక్క రోజులో ప్రారంభమైంది కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ముఖ్యంగా 1970లు, 1980లు నుంచి వేగవంతమైన పట్టణీకరణ మరియు పారిశ్రామికీకరణ కారణంగా ఈ సమస్య క్రమంగా మొదలైంది. పెరుగుతున్న జనాభా అవసరాలను అనుగుణంగా నగరంలో పరిశ్రమల స్థాపన, మరియు నిర్మాణ కార్యకలాపాలు పెరిగాయి. ఆ సమయంలో పర్యావరణ పరి రక్షణ చట్టాలు పటిష్టంగా లేకపోవడం, మరియు వాటి అమలులో లోపాల వల్ల పారిశ్రామిక వ్యర్థాలు, వాహన కాలుష్యం నగర గాలిలోనెమ్మదిగా చేరడం ప్రారంభమైంది. అయితే, ఆ దశలో పరిస్థితి ఇంకా నియంత్రణలోనే ఉండేది.కాలుష్యం నిజంగా ఢిల్లీ స్థాయికి చేరుకోవడం 1990ల చివరి భాగంలో మరియు 2000వ సంవత్సరం ప్రారం భంలో మొదలైంది. ఈ కాలంలో ఢిల్లీ మరియు చుట్టుపక్కల ప్రాంతాలు ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందాయి. దాంతో, నగరంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరి గింది. పాత డీజిల్ వాహనాలు మరియు నాణ్యతలేని ఇంధనం వాడకం వలన గాలిలో హానికరమైన రేణువులు, వాయువుల శాతం పెరిగింది. దీనికి తోడు, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలో పంట కోతల తర్వాత వరిగడ్డి దహనం అలవాటుగా మారడం వల్ల, శీతాకాలం వచ్చేసరికి ఆ పొగ ఢిల్లీ వైపు మళ్లడం ప్రారంభమైంది. అప్పటినుండే పొగమంచు సమస్య ఏటా మొదలై, వాయు నాణ్యత సూచీ పడిపోవడం మనం గమనించ చడం మొదలుపెట్టాం.గడిచిన దశాబ్దంలో ఈ సమస్య మరింత జటిలమైంది. పారిశ్రామిక, వాహన కాలుష్యం, నిరంతర నిర్మాణ కార్యకలాపాల నుండి వచ్చే దుమ్ము, మరియు వరిగడ్డి దహనంతో కాలుష్య కారకాలన్నీ కలగలిసి ఢిల్లీని ప్రమాదకరమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్య కేవలం వాతా వరణ సంబంధమైనది కాక, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఒక సామాజిక, జాతీయ ఆరోగ్య సంక్షోభంగా పరిణమించింది. ఢిల్లీ కాలుష్యానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ, ముఖ్యంగా శీతాకాలంలో పంజాబ్ మరియు హర్యానా వంటి పొరుగు రాష్ట్రాల రైతులు పంట కోతల తర్వాత పొలాల్లో వరిగడ్డిని కాల్చివేయడం ఒక ప్రధాన సమస్య గా పరిణమించింది. వరి కోసిన తర్వాత వచ్చే ఆ ఎండుగడ్డిని తొలగించడానికి, తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసుకోవడానికి రైతులు దీనిని తగులబె డతారు. ఈ పొగ, చల్లని వాతావరణం మరియు తక్కువ వేగంతో కూడిన గాలుల కారణంగా ఢిల్లీ వైపు మళ్లి, నగరంలో దట్టమైన పొగమంచును సృష్టిస్తుంది. దీనివల్ల గాలి నాణ్యత సూచీ ప్రమాదకరంగా పెరగడానికి ప్రధాన కారణమవుతోంది. ఈ వరిగడ్డిని కాల్చకుండా, దానిని పునర్వినియోగం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ వ్యర్థాలను సేంద్రీయ ఎరువుగా, పశుగ్రాసంగా, లేదా జీవ ద్రవ్య ఇంధనంగా ఉప యోగించవచ్చు. దీని కోసం రైతులకు రాయితీపై యంత్రాలను అందించడం, ఇటు వంటి వ్యర్థాలను కొనుగో లు చేసే కేంద్రాలను ఏర్పాటు చేయడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత.పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పంట వ్యర్థాల దహనాన్ని పూర్తిగా అరికట్టడానికి ప్రత్యామ్నాయ కల్పన మరియు ప్రోత్సాహకాలను అందించాలి. రైతులపై జరిమానాలు విధించడం కంటే, వరిగడ్డిని కాల్చకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపించడం ముఖ్యం. పొరుగు రాష్ట్రాలు, ఢిల్లీ ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం కలిసికట్టుగా, సమన్వయంతో దీర్ఘకాలిక పరిష్కార ప్రణాళికను అమలు చేయాలి. ఢిల్లీలోని స్థానిక కాలుష్య వనరులను నియంత్రించడం కూడా అంతే ముఖ్యం. వాహనాల నుంచి వెలువడే పొగ కాలుష్యానికి మరో ప్రధాన కారణం. దీనిని నియంత్రించడానికి, ఢిల్లీ ప్రభుత్వం విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలి. ప్రభుత్వ రవాణా వ్యవస్థలో విద్యుత్ బస్సుల సంఖ్యను పెంచడం, ప్రైవే ట్ వాహనాలకు రాయితీలు ఇవ్వడం, ఛార్జింగ్ కేంద్రాలను విస్తరించడం ద్వారా డీజిల్, పెట్రోల్ వాహనాల వాడకాన్ని తగ్గించాలి. అలాగే, కాలుష్యం కారణంగా ఢిల్లీలోకి వచ్చే సరుకు రవాణా వాహనాలపై ఆంక్షలు విధించాల్సిన అవసరం ఉంది. చుట్టూ నిర్మించిన వేగ మార్గాలను పూర్తిగా ఉపయోగంలోకి తీసుకురావడం ద్వారా, ఢిల్లీ మీదుగా వెళ్లే అనవసరమైన రవాణాను నగరం వెలుపలి నుండేదారి మళ్లించాలి.ఢిల్లీలో వాయు కాలు ష్యాన్ని నియంత్రిం చడానికి కృత్రిమ వర్షం ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. గాలి లోని విషాన్ని కడిగివేయడానికి ఇది కొంత ఉపయోగపడవచ్చు, కానీ ఇది శాశ్వత పరి ష్కారం కాదు. పంట వ్యర్థాల దహనాన్ని శాశ్వతంగా ఆపడం, విద్యుత్ వాహనాలను ప్రోత్సహించడం, మరియు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం వంటి దీర్ఘకాలిక, స్థిరమైన చర్యలు తీసుకోవడం ద్వారానే ఢిల్లీ ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకోగలుగుతారు. కేవలం ఢిల్లీకే కాదు, యావత్తు దేశానికే ప్రధాన నగరంగా నిలవాల్సిన రాజధాని, కాలుష్యాన్ని కట్టడిచేయడానికి ఒక హెచ్చరిక. ప్రభుత్వాలు, రైతులు, పౌరులు అందరూ తమ బాధ్యతను గుర్తించి, 'స్వచ్ఛమైన గాలి' కోసం కలిసి పనిచేయాల్సిన సమయం ఇది. ఢిల్లీలో వాయు కాలుష్య సమస్య కేవలం వాతావరణానికి సంబంధించిన ఇబ్బంది కాదు, ఇది దేశ రాజధాని ప్రజల జీవన హక్కుకు మరియు ఆరోగ్యానికి సంబంధించిన జాతీయ సంక్షోభం. దశాబ్దాలుగా పెరిగిన పట్టణీకరణ, పారిశ్రామిక మరియు వాహన కాలుష్యం, ముఖ్యంగా శీతాకాలంలో పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వరిగడ్డి పొగ కలగలిసి ఢిల్లీ గాలిని విషతుల్యం చేశాయి. కాలుష్యాన్ని కడిగేయడానికి కృత్రిమ వర్షం వంటి తాత్కాలిక ఉపశమనాలు ఎంతమాత్రం సరిపోవు. పంట వ్యర్థాల కాల్చకుండా శాశ్వత పరిష్కారాలు చూపడం, విద్యుత్ వాహనాలను ప్రోత్సహించడం, కఠిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం వంటి సుస్థిరమైన చర్యలు తీసుకోవడం తక్షణ కర్తవ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు పౌరులు తమ బాధ్యతను గుర్తించి, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించేందుకు సమన్వయంతో కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. లేదంటే, కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఢిల్లీ ఊపిరి పీల్చుకోలేని విషాద చరిత్రగా మిగిలిపోతుంది.

# ప్రపంచాన్ని ఏలుతున్న మహిళలు

■ అత్యున్నత నాయకులుగా, మార్గదర్శకులుగా తమదైన చెరగని ముద్రలు ■ అసాధారణ మేధస్సుతో రాజ్యాధికార పీఠాలను అధిరోహించిన నేతలు ■ క్లిష్ట సమయాల్లో వారు తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు ■ సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొంటూ సంస్కరణల అమలు ■ వారి రాజనీతిజ్ఞతకు నిదర్శనాలు అపారమైన నాయకత్వ లక్షణాలు

**తేజస్వి**
**హైదరాబాద్**

(నిన్నటి సంచిక తరువాయి)

### గత నేతలు:

**ఇందిరా గాంధీ**


ఇందిరాగాంధీ (భారతదేశం)

భారతదేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా రెండు విభిన్న కాలాల లో (1966–77, 1980–84) నాయక త్వం వహించిన ఇందిరా గాంధీ, తన పాలనలో సోషలిస్ట్ విధానాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఆమె అత్యంత ముఖ్య మైన చర్యలలో 1969లో 14 పెద్ద ప్రైవేట్ బ్యాంకు లను జాతీయం చేయడం ఒకటి. ఈ నిర్ణయం ద్వారా, బ్యాంకు సేవలు కేవలం ధనికులకే పరిమితం కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవ సాయం మరియు చిన్న తరహా పరిశ్రమల వంటి ప్రాధాన్య రంగాలకు కూడా చేరేలా లక్ష్యాన్ని పెట్టుకున్నారు. 1971 ఎన్నికలలో ఆమె ప్రవేశపెట్టిన శక్తివం తమైన 'గరీబీ హటావో' (పేదరికాన్ని తొలగించండి) అనే నినాదం దేశంలోని పేద వర్గాలలో ఆశలను రేకెత్తించి, ఆమెకు అపారమైన ప్రజాదరణను తెచ్చి పెట్టింది. అంతే కాకుండా, ఆమె పూర్వపు రాజకుటుంబా లకు చెల్లించే ప్రత్యేక పింఛన్లను రద్దు చేయడం ద్వారా సమానత్వాన్ని తీసుకురావడానికి ప్రయత్నిం చారు. ఆమె విదేశాంగ మరియు రక్షణ విధానాలలో చూపిన పటిమ అసాధారణమై నది. 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారతదేశం సాధించిన నిర్ణ యాత్మక విజయం, తూర్పు పాకిస్తాన్‌లో ప్రజల హక్కుల పరిరక్షణకు దారితీసి, బంగ్లాదేశ్ ఒక స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడానికి కారణమైంది. ఇది ఆమెను ప్రపంచ వేదికపై ఒక శక్తిమంతమైన నాయకురాలి గా నిలబెట్టింది. ఆమె పాలనలో దేశం శాస్త్రీయంగానూ బలం పుంజుకుందిబీ 1974లో రాజస్థాన్ లోని పోఖ్రాన్‌లో భారతదేశం మొట్టమొదటి అణు పరీక్షను విజయవంతంగా నిర్వ హించడం ద్వారా, ప్రపంచంలో అణు శక్తి కలిగిన దేశాల జాబితాలో చేరింది. అయితే, 1975లో ఆమె ప్రభుత్వం దేశంలో అత్య వసర పరిస్థితి విధించడం ఆమె పాలనా కాలంలో అత్యంత వివాదాస్పదమైన మరియు చీకటి ఘట్టంగా మిగిలిపోయింది. ఈ కాలంలో పౌరుల ప్రాథమిక హక్కులను సస్పెం డ్ చేయడం, పత్రికా స్వేచ్ఛను అణచివేయడం వంటి చర్యల వల్ల ఆమె తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ, అత్యవసర పరిస్థితి తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓడిపోయినా, 1980లో ఆమె తిరిగి అధికారంలోకి రావడం ఆమె కున్న ప్రజల మద్దతుకు నిదర్శనం. చివరికి, 1984లో సిక్కు తీవ్రవాదాన్ని అణచి వేయ డానికి చేపట్టిన ఆపరేషన్ బ్లూ స్టార్ పర్యవసానంగా ఆమె హత్యకు గురికావడం భారత రాజకీయాలపై పెను ప్రభావం చూపింది.

**మార్గరెట్ థాచర్**


మార్గరెట్ థాచర్ (యుకె)

యునైటెడ్ కింగ్‌డమ్ చరిత్రలో మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా (1979–1990) పనిచేసిన మార్గరెట్ థాచర్ తన కఠినమైన, సంప్రదాయవాద ఆర్థిక విధానాల కారణంగా "ఐరన్ లేడీ'గా ప్రసిద్ధి చెందారు. 1970లలో బ్రిటన్‌ను పట్టి పీడించిన అధిక ద్రవ్యోల్బణం మరియు పారిశ్రామిక అనిశ్చితిని ఎదుర్కోవడానికి, ఆమె ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ ప్రభావాన్ని తగ్గించాలని నిశ్చయించుకున్నారు. ఆమె పాలన యొక్క ప్రధాన లక్ష్యం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం (ప్రైవేటీకరణ), ముఖ్యంగా బ్రిటిష్ టెలికాం, బ్రిటిష్ గ్యాస్ వంటి సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో పోటీని పెంచడం, సామర్థ్యాన్ని మెరుగుపరచడం మరియు యూనియన్ల అధికారాన్ని తగ్గించడం. ఆమె దేశీయంగా తీసుకొచ్చిన మార్పులలో అత్యంత వివాదాస్పదమైనది ట్రేడ్ యూనియన్ల శక్తిని అణచివేయడం. అధిక వేతన డిమాండ్లు మరియు నిరంతర సమ్మెల కారణంగా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి, ఆమె ట్రేడ్ యూనియన్ల కార్యకలాపాలను పరిమితం చేసే కఠిన చట్టాలను తీసుకువచ్చారు. దీని ఫలితంగా, 1984–85లో గని కార్మికుల సమ్మె వంటి ముఖ్యమైన పారిశ్రామిక వివాదాలను ఆమె ప్రభుత్వం దృఢంగా ఎదుర్కొని విజయం సాధించింది, ఇది బ్రిటీష్ కార్మిక శక్తిపై యూనియన్ల ప్రభావాన్ని సమూలంగా తగ్గించింది. అంతేకాకుండా, ఆమె ఆదాయపు పన్నులను తగ్గించడం ద్వారా పెట్టుబడిని మరియు వ్యక్తిగత వ్యాపారాలను ప్రోత్సహించారు.

థాచర్ యొక్క నాయకత్వ పటిమ 1982లో ఫాక్‌ల్యాండ్స్ యుద్ధం సమయంలో స్పష్టమైంది. అర్జెంటీనా ఫాక్‌ల్యాండ్ దీవులపై దాడి చేసినప్పుడు, ఆమె సైనిక చర్యకు ఆదేశించడంలో ఎటువంటి సంకోచం చూపలేదు. ఈ యుద్ధంలో బ్రిటన్ సాధించిన విజయం, బ్రిటీష్ జాతీయ గర్వాన్ని పెంచింది మరియు అంతర్జాతీయ వేదికపై ఆమె యొక్క ధృడమైన నాయకత్వాన్ని బలపరిచింది. అయినప్పటికీ, ఆమె ఆర్థిక సంస్కరణలు కార్మిక వర్గాలలో, ముఖ్యంగా దేశ ఉత్తర ప్రాంతాలలో, తీవ్ర వ్యతిరేకతకు దారితీసి, సామాజిక విభేదాలను సృష్టించాయి, చివరికి ఇదే ఆమె పదవిని కోల్పోవడానికి కారణమైంది.

**సిరిమావో బండారునాయకే**


సిరిమావో బండారునాయకే (శ్రీలంక)

సిరిమావో బండారునాయకే ప్రధాన మంత్రి పదవిని అధిరోహించిన మొట్ట మొదటి మహిళగా (1960–65, 1970–77, 1994–2000) ఒక అసాధారణమైన ఘనతను సాధిం చారు. తన భర్త హత్య తర్వాత రాజకీ యాల్లోకి వచ్చిన ఆమె, శ్రీలంక రాజకీ యాలను సోషలిస్ట్ మరియు జాతీయ వాద భావజాలంతో ప్రభావితం చేశారు. ఆమె తొలి పాలనా కాలంలో విదేశీ పెట్టుబడుల కంటే దేశీయ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తూ, విదేశీ సంస్థల యాజమాన్యంలో ఉన్న చమురు కంపెనీలు, పాఠశాలలు మరియు ఇతర ప్రైవేట్ సంస్థలతో సహా అనేక రంగాలను జాతీయం చేశారు.

> **ప్రపంచ రాజకీయ వేదికపై మహిళలు కేవలం భాగస్వాములుగా కాకుండా, అత్యున్నత నాయకులుగా, మార్గదర్శకులుగా తమదైన చెరగని ముద్ర వేశారు, ఇప్పటికీ వేస్తూనే ఉన్నారు. పురుషాధిక్య సమాజంలో అనేక సవాళ్లను ఎదుర్కొ ని, తమ సంకల్పం, ధైర్యం, అసాధారణమైన మేధస్సుతో రాజ్యాధికార పీఠాలను అధిరోహించిన ఈ మహిళా నేతల ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదా యకం. వారి జీవితాలు కేవలం విజయాల పరంపర మాత్రమే కాదు, సమాన త్వం కోసం, అభివృద్ధి కోసం వారు చేసిన నిరంతర పోరాటానికి, అవిశ్రాంత కృషికి నిదర్శనాలు.సంప్రదాయ హద్దులను చెరిపివేసి, నిరంకుశత్వాన్ని ధిక్కరించి, దేశాల గతిని మార్చిన ఈ మహిళా మూర్తులు – ప్రజల హృదయాల్లో, చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. క్లిష్ట సమయాల్లో వారు తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొన్న తీరు, సంస్కరణ లను అమలు చేసిన పద్ధతి...వారి రాజనీతిజ్ఞతకు, అపారమైన నాయకత్వ లక్షణాల కు అద్దం పడతాయి.**

ఆమె పాలనలో శ్రీలంక ముఖ్యంగా అంతర్జాతీయంగా తనదైన ముద్ర వేసింది. ఆమె అలీన ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించి, మధ్యస్థ దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని పెంపొందించడానికి కృషి చేశారు. 1976లో కొలంబోలో జరిగిన అలీన దేశాల శిఖరాగ్ర సమావేశానికి అధ్యక్షత వహించడం ద్వారా, అంతర్జాతీయ వేదికపై శ్రీలంక యొక్క పాత్రను బలోపేతం చేయగలిగారు. దేశీయంగా, ఆమె నాయకత్వంలోనే 1972లో సిలోన్‌ను బ్రిటిష్ పాలన నుండి పూర్తిగా విముక్తి చేసి, పూర్తి సార్వభౌమాధికారం కలిగిన 'శ్రీలంక రిపబ్లిక్'గా ప్రకటించి, కొత్త రాజ్యాంగాన్ని అమలు చేశారు.

అయితే, ఆమె ప్రభుత్వం అనుసరించిన సంస్కరణలు దేశీయంగా అనేక సవాళ్లను సృష్టించాయి. ముఖ్యంగా సింహాళీయులకు ప్రాధాన్యతనిచ్చే సింహళ భాషా విధానాలను ఆమె ముందుకు తీసుకెళ్లడం వల్ల దేశంలోని తమిళ వర్గాల మధ్య తీవ్ర అసంతృప్తి పెరిగింది, ఇది తరువాతి దశాబ్దాలలో అంతర్యుద్ధానికి దారితీసిన ముఖ్య కారణాలలో ఒకటిగా మారింది. అయినప్పటికీ, ఆమె చివరి పాలనా కాలంలో, ఆమె కుమార్తె చంద్రికా కుమారతుంగ అధ్యక్షురాలిగా ఉ న్నప్పుడు, ఆమె తిరిగి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, శ్రీలంక రాజకీయాలలో సుదీర్ఘ కాలం పాటు ఒక కేంద్ర బిందువుగా నిలిచారు.

**షేక్ హసీనా**


షేక్ హసీనా (బంగ్లాదేశ్)

బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజిబుర్ రెహమాన్ కుమార్తె అయిన షేక్ హసీనా, బంగ్లాదేశ్‌కు అత్యధిక కాలం (1996–2001, 2009–2024) ప్రధానమంత్రి గా పనిచేసి, దేశ ఆర్థిక మరియు సామాజిక పురోగతికి మార్గ నిర్దేశం చేశారు. ఆమె పాలనలో బంగ్లా దేశ్ స్థిరమైన మరియు ఆకట్టుకునే ఆర్థిక వృద్ధిని సాధించింది. ఆమె ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన మరియు ముఖ్యంగా దుస్తుల తయారీ రంగం భారీగా విస్తరించడం ద్వారా బంగ్లాదేశ్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఎదిగింది. విద్య, ఆరోగ్యం మరియు గ్రామీణాభివృద్ధిలో మె–రుగుదలలు, ముఖ్యంగా మహిళల విద్య మరియు సాధికారతకు ఆమె ప్రాధాన్యత ఇచ్చారు.

ఆర్థిక వృద్ధితో పాటు, ఆమె ప్రభుత్వం సామాజికాభివృద్ధిపై కూడా దృష్టి సారించింది. ఆమె బాలికల విద్యకు ప్రోత్సాహం, మహిళల సాధికారత మరియు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ సేవలను విస్తరించడానికి అనేక కార్యక్రమాలను అమలు చేశారు. దేశీయ భద్రత విషయంలో, ఆమె ఉగ్రవాదం మరియు తీవ్రవాదంపై కఠినమైన పోరాటం చేసి, దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేయడానికి చారిత్రక చర్యలు తీసుకున్నారు. ఈ చర్యల కారణంగా, ముఖ్యంగా మునుపటి దశాబ్దాలతో పోలిస్తే, దేశంలో భద్రతా వాతావరణం మెరుగుపడింది.

ఆమె పాలనా కాలంలో చేపట్టిన ప్రతిష్టాత్మకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌లలో ఒకటైన పద్మా వంతెన నిర్మాణం (స్వదేశీ నిధులతో) దక్షిణ బంగ్లాదేశ్‌ను రాజధాని ఢాకాతో అనుసంధానం చేసి, దేశ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసింది. అయితే, ఆమె సుదీర్ఘ పాలనలో ప్రతిపక్షాల నుండి తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు. ప్రతిపక్షాలను అణచివేశారనే మరియు దేశంలో ప్రజాస్వామ్య విలువలు మరియు ఎన్నికల పారదర్శకత క్షీణించాయనే ఆరోపణలు ఆమె పాలనపై మచ్చగా మిగిలాయి.

**కమలా హారిస్**


కమలా హారిస్ (అమెరికా)

భారతదేశ మూలాలు, ఆఫ్రికన్ అమెరికన్ నేపథ్యం ఉన్న ఒక ప్రముఖ అమెరికన్ రాజకీయ నాయకురాలు. ఆమె 2021 నుండి అమెరికా సంయుక్త రాష్ట్రాల ఉపాధ్యక్షురాలిగా పనిచేసి, ఆ పదవిని చేపట్టిన మొట్టమొదటి మహిళ, మొట్టమొదటి ఆఫ్రికన్ అమెరికన్ మరియు మొట్టమొదటి దక్షిణ ఆసియా అమెరికన్గా చరిత్ర సృష్టించారు. ఉపాధ్యక్ష పదవికి ముందు, ఆమె కాలిఫోర్నియా రాష్ట్రం నుండి సెనేటర్‌గా పనిచేశారు మరియు అంతకుముందు కాలిఫోర్నియా రాష్ట్రానికి అటార్నీ జనరల్‌గా (ప్రధాన న్యాయవాది) కూడా పనిచేసి, ఆ రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళ అయ్యారు. ఆమె న్యాయవాదిగా, ప్రాసిక్యూటర్‌గా తన వృత్తిని ప్రారంభించారు, ప్రజా సేవలో సుదీర్ఘ అనుభవాన్ని పొందారు.

ఉపాధ్యక్షురాలిగా, ఆమె పరిపాలన యొక్క ముఖ్య లక్ష్యాలలో ఆమె చురుకుగా పాల్గొన్నారు. అమెరికా దక్షిణ సరిహద్దులో వలసల సమస్యతో సహా కీలకమైన జాతీయ సమస్యలను పరిష్కరించడానికి ఆమె నాయకత్వం వహించారు. పర్యావరణ మార్పు, ఓటింగ్ హక్కుల రక్షణ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కార్యక్రమాలలో ఆమె క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆమె విధానాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం మరియు సంక్షేమాన్ని పెంచడంపై దృష్టి సారించాయి.

కమలా హారిస్ రాజకీయ జీవితం అమెరికన్ రాజకీయాలలో మహిళలకు మరియు మైనారిటీ వర్గాలకు ఒక స్ఫూర్తిదాయకం. ఆమె రాజకీయ ప్రయాణం, శక్తివంతమైన నాయకత్వ సామర్థ్యాన్ని మరియు దేశాభివృద్ధి పట్ల ఆమెకున్న నిబద్ధతను చాటుతుంది. అయినప్పటికీ, దేశంలో ఎదురవుతున్న తీవ్ర రాజకీయ విభజన మరియు ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడంలో ఆమె ఎప్పటికప్పుడు విమర్శలను కూడా ఎదుర్కొన్నారు.

**హిల్లరీ క్లింటన్**


హిల్లరీ క్లింటన్ (అమెరికా)

హిల్లరీ క్లింటన్ అమెరికన్ రాజకీయాలలో అత్యంత ప్రభావవంతమైన మరియు అనుభవజ్ఞులైన మహిళా నాయకులలో ఒకరు. ఆమె ఒకప్పుడు అమెరికా యొక్క ప్రథమ మహిళగా (మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ భార్య) పనిచేశారు, ఆ తరువాత న్యూయార్క్ రాష్ట్రం నుండి సెనేటర్‌గా ఎన్నికయ్యారు. ఆమె అమెరికా సెక్రటరీ ఆఫ్‌స్టేట్ (2009–2013)గా పని చేసారు. ఈ పాత్రలో, ఆమె దేశం యొక్క దౌత్య సంబంధాలను బలోపేతం చేయడానికి మరియు ప్రపంచ స్థాయిలో అమెరికా ప్రయోజనాలను కాపాడటానికి ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు.

ఆమె విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు, ఆమె బహుళజాతి సహకారాన్ని ప్రోత్సహించడం, మహిళల హక్కులు మరియు సాధికారతకు మద్దతు ఇవ్వడంపై దృష్టి సారించారు. అంతేకాకుండా, ఆమె 2016లో అమెరికా అధ్యక్ష పదవికి డెమొక్రాటిక్ పార్టీ తరపున నామినేట్ అయిన మొట్టమొదటి మహిళగా చరిత్ర సృష్టించారు. అధ్యక్ష ఎన్నికలలో విజయం సాధించలేకపోయినప్పటికీ, ఆ ఎన్నికలలో ఆమె పోరాటం అమెరికన్ రాజకీయాలలో మహిళల పాత్రకు మరియు వారి ఆకాంక్షలకు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

హిల్లరీ క్లింటన్ ప్రజా జీవితం సంక్లిష్టమైనది మరియు తరచుగా వివాదాస్పదమైనది. ఆమె తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో అనేక విమర్శలు మరియు పరిశీలనలను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ, ఆమె నిస్సందేహంగా అమెరికన్ రాజకీయాలు మరియు ప్రజా సేవపై చెరగని ముద్ర వేశారు. రాజకీయాలలో, అంతర్జాతీయ దౌత్యంలో మరియు మహిళల హక్కుల కోసం ఆమె చేసిన కృషి, ఆమెను ఆధునిక అమెరికన్ రాజకీయాలలో ఒక శక్తివంతమైన వ్యక్తిగా నిలబెట్టింది.

రాజకీయాలలో మహిళా నాయకత్వం అనేది దేశాల యొక్క ప్రగతికి, భద్రతకు మరియు ఆర్థిక సంస్కరణలకు ఎంత ముఖ్యమో వీరి నాయకత్వం స్పష్టం చేస్తోంది. అధికారం లింగ భేదాలతో సంబంధం లేకుండా, మహిళలు అత్యున్నత పదవుల్లో ఉన్నప్పుడు, వారు తమ దేశాల విధానాలను, అంతర్జాతీయ సంబంధాలను మరియు ఆర్థిక దిశను ప్రభావితం చేయగలరని నిరూపించారు. ప్రపంచంలోని మహిళా నాయకురాండ్రు తమ సొంత దేశాలలో కఠినమైన నిర్ణయాలు తీసుకుని, దృఢమైన నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు.

వారు తమ పాలనలో సోషలిస్ట్ విధానాల నుండి సంప్రదాయవాద విధానాల వరకు వైవిధ్యభరితమైన మార్గాలను అనుసరించినప్పటికీ, వారి ప్రయత్నాలన్నీ దేశాభివృద్ధికి మరియు జాతీయ ప్రయోజనాలకు దోహదపడ్డాయి. ఈ నాయకురాండ్రందరూ తమ దేశాలలోనే కాకుండా, ప్రపంచ స్థాయిలో కూడా చరిత్ర సృష్టించారు. పురుషాధిక్య సమాజంలో అనేక సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, తమ స్థానాలను సుస్థిరం చేసుకోవడం ద్వారా, వారు ఇతర మహిళలకు మరియు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచారు.కాబట్టి, రాజకీయాలలో మహిళల చురుకైన భాగస్వామ్యం అనేది కేవలం సమానత్వం కోసం మాత్రమే కాదని, మరింత సమగ్రమైన, సమతుల్యమైన మరియు స్థిరమైన పరిపాలనను అందించడానికి ఇది కీలకం అని చెప్పవచ్చు. ఈ నాయకత్వం ప్రపంచ రాజకీయాలపై చెరగని ముద్ర వేసింది.

# గతి తప్పుతున్న ప్రాంతీయ పార్టీలు !




**కైలసాని శివప్రసాద్**
**9440203999**

దేశంలో 8 జాతీయ పార్టీలు, 58 ప్రాంతీయ పార్టీలు, 2763 నమోదు కాబడి గుర్తింపు లేని రాజకీయ పార్టీలు ఉన్నాయి. గతకొద్ది సంవత్సరాలుగా జాతీయ పార్టీ లపై దేశ ప్రజలలో విశ్వాసం సన్నగిల్లుతుంది అనేది నిర్వివాదఅంశం. దీంతో దేశ వ్యాప్తంగా ప్రాంతీయ పార్టీల ప్రభావం అధికమైపోయింది. జాతీయ రాజకీయా లను శాసించే స్థాయికి ప్రాంతీయ పార్టీలు అభివృద్ధి చెందడం గమనార్హం. గత కొద్దికాలంగా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సంకీర్ణ ప్రభుత్వాలలో ప్రాంతీయ పార్టీలు చాలా కీలకంగా మారాయి. ప్రాంతీయ పార్టీలు కొత్తగా పుట్టుకొచ్చినవి కావు. శిరోమణి అకాలీదళ్, ఎఐఎంఐఎం, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, జమ్ము– కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ లాంటి అనేక ప్రాంతీయ పార్టీలు దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే ఆవిర్భవించాయి. స్థానిక రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు ప్రతినిధు లుగా వ్యవహరిస్తూ స్థానిక సమస్యలు, సంస్కృతులకు ప్రాంతీయ పార్టీలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఉంటాయి. ఈ పరిణామాలతో దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రాంతీయ పార్టీల ఆధిక్యంతో తమిళనాడు,ఆంధ్రప్రదేశ్ లాంటి అనేక రాష్ట్రాలలో జాతీయ పార్టీలు ఉనికినే కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రాంతీయ పార్టీలు స్థానిక రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుండడమే వాటికి ప్రజలలో ఆదరణ ఎక్కువగా లభిస్తూ ఉ ందనడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ప్రాంతీయ పార్టీల ప్రభావాన్ని తట్టుకుని రాష్ట్రాలలో మనుగడ సాగించేందుకు జాతీయ పార్టీలు కూడా ప్రస్తుత పరిస్థితులలో ఆయా రాష్ట్రాలలో ఉన్న స్థానిక సమస్యలపై దృష్టి కేంద్రీకరించవలసిన పరిస్తితి ఏర్పడింది. అదేవిధంగా సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది ప్రాంతీయ పార్టీలే అనడంలో ఎటువంటి సందేహం లేదు. 1983 లో తెలుగుదేశం పార్టీ మొట్ట మొదటి పర్యాయం అధికారం చేపట్టినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామా రావు అమలు చేసిన రెండు రూపాయలకే కిలో బియ్యం లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అప్పట్లో దేశవ్యాప్తం గా సంచలనం సృష్టించాయి. రామారావు అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు అనేక రాష్ట్రాలలోని అనేక ప్రాంతీయ పార్టీలతో పాటూ జాతీయ పార్టీలకు కూడా మార్గదర్శకంగా మారడం గొప్ప పరిణామం. శిరోమణి అకాలీదళ్, ఎఐఎంఐఎం, జమ్ము– కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్,మీజో నేషనల్ ఫ్రంట్, మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ, జెఎంఎం, డిఎంకె, అన్నా డిఎంకె లాంటి ప్రాంతీయ పార్టీలు తెలుగుదేశం పార్టీ కంటే మునుపే ఆవిర్భవిం చాయి. అయినా దేశంలో సంక్షేమ కార్యక్రమాలను ఆచరణలోకి తెచ్చింది మాత్రం తెలుగుదేశం పార్టీనే అని కచ్చితంగా చెప్పవచ్చు.1971 ఎన్నికల సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి ఇందిరా గాంధీ గరీబీ హటావో–దేశ్ బచావో (పేదరికాన్ని నిర్మూలించండి– దేశాన్ని కాపాడండి) అనే నినాధంతో దేశవ్యాప్తంగా హడావిడి చేసి ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్స రాల తరువాత 1975 లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో పేదరిక నిర్మూలన కొరకు 20 సూత్రాల కార్యక్రమం ప్రారంభించారు. దాని వలన నామమాత్రా సత్ఫలితాలు కూడా వెలువడిన దాఖలాలు లేవు. 20 సూత్రాల కార్యక్రమం దేశంలో ప్రారంభంఅయి 50 సంవత్సరాలు దాటినా ప్రజల పేదరికం కేంద్రంగా రాజకీయాలు చేస్తూ దేశంలోని ప్రాంతీయ, జాతీయ పార్టీలన్నీ ఇప్పటికీ మనుగడ సాగిస్తూ ఉం డడం చూస్తే దేశంలో ఇంకా పేదరికం ఎంత బలంగా ఉందో సులభంగా అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా పాలనా సంస్కరణలకు పెద్దపీట వేయడం కూడా ప్రాం తీయ పార్టీలు ఆయా రాష్ట్రాలలోని స్థానిక ప్రజల మన్ననలు పొందడానికి ఒక కార ణంగా భావించవచ్చు. వాస్తవంగా సంక్షేమ కార్యక్రమాలు, పాలనా సంస్కరణలకు బీజం వేయడమే కాదు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకూ ప్రాంతీయ పార్టీలు అత్యధిక ప్రాధాన్యమిస్తాయి. కానీ ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ప్రాంతీయ పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థను ఎటు తీసుకుపోతున్నాయో అంతు చిక్కడంలేదు. ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యంకాని అసాధారణ హామీలు ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చేందుకు ప్రాంతీయ పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి. హామీలు ఇచ్చేముందు రాష్ట్ర ఆదాయాన్ని, ఖర్చులను ఈ ప్రాంతీయ పార్టీలు ఏమాత్రం పట్టిం చుకోవడం లేదు. అదేవిధంగా తాము ఇచ్చే హామీలు ప్రజలకు నిజంగా అవసరమా? లేదా? అని ఏమాత్రం పరిగణి లోకి తీసుకోవడంలేదు. ప్రాంతీయ పార్టీలు అధికారమే ప్రమావధిగా విచ్చలవిడిగా ప్రజలకు తాయిలాలు హామీలుగా ఇస్తూ ఉన్నాయి. అడ్డూ అదుపులేకుండా ఇచ్చిన హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు ప్రజలకు తాము ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు అష్ట కష్టాలు అనుభవిస్తూ అప్రజాస్వామిక పద్ధతులకు తెరదీస్తున్నాయి. ఆడంబరాలకు, ప్రచార ఆర్భాటాలకు, నిరూపయోగమైన హామీలకు విచ్చల విడిగా ఖర్చు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప గా మారుస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు సకాలంలో చెల్లించలేకున్నాయి. ఆఖరికి ఉద్యోగులు పొదుపు చేసుకునే సిపియస్ మొత్తాన్ని కూడా ఇతర కార్యక్రమాలకు మళ్లించే స్థాయికి ప్రభుత్వాలు దిగజారిపోతున్నాయి. బడ్జెట్ ను నిర్దిష్ట ప్రణాళికా బద్ధంగా ఉపయోగించుకోకుండా అడ్డదిడ్డంగా ఉపయో గించు కుంటున్నాయి. పాతఅప్పులతో ఎఫ్.ఆర్.బి.ఎం పరిమితి మించుతూ ఉండడం తో కొత్త అప్పులు పొందేందుకు ప్రభుత్వాలు అనేక అడ్డదారులు వెతుకుంటున్నాయి. కార్పొరేషన్ల ద్వారా అప్పులు చేయడమే కాకుండా రాష్ట్ర దీర్ఘకాలిక ఆదాయాన్ని, రాష్ట్ర ఆస్తులను ఇష్టానుసారం కుదువ పెడుతున్నాయి. ఈ పరిణామాలతో రాష్ట్రాలు కోలుకోలేని విధంగా అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. సుదీర్ఘ కాలంగా ప్రాం తీయ పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలు సంక్షేమం, అభివృద్ధి ఎరుతో అధిక మొత్తంలో అప్పులు చేసినా అక్కడి ప్రజల జీవితాలలో ఏమైనా మార్పులు వచ్చాయా అంటే అదీ జరగడంలేదు. ఆ రాష్ట్రాలలో పేదరికం, నిరుద్యోగం నామ మాత్రంగా నైనా తగ్గిన దాఖలాలు లేవు. అదేవిధంగా విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాలకు ప్రజలు పడే కష్టాలు కూడా ఏమాత్రం తగ్గినట్లు కనిపించడంలేదు. గ్రామాలు కూడా ఏమాత్రం అభివృద్ధి లేకుండా నిర్మానుష్యంగానే ఉన్నాయి. దీని ప్రకారం ఈ ప్రభుత్వాలు చేసే సంక్షేమ కార్యక్రమాలు, నగదు బదిలీలు, ఉచితాలు కేవలం ప్రజలకు ఉపశమనం మాత్రమే కలిగిస్తాయని స్పష్టంగా తెలుస్తుంది. ఉచితంగా విద్య, వైద్యం, ఉపాది, ఉ ద్యోగం, వ్యవసాయ అవసరాలతో పాటూ పేదలకు గృహ సౌకర్యం కల్పించినప్పుడే కదా పేదరికం తగ్గి ప్రజల జీవితాలు, గ్రామాలు కళకళ లాడేది. గతంలో సంక్షేమం పేరుతో ఉచితాలు పంచేందుకు జాతీయ పార్టీలు పూర్తిగా వ్యతిరేకంగా ఉండేవి. కానీ ప్రాంతీయపార్టీల ప్రాభవాన్ని తట్టుకుని రాష్ట్రాలలో పాగా వేసేందుకు ప్రాంతీయ పార్టీ లను మించి కాంగ్రెస్, బిజెపి లాంటి జాతీయపార్టీలు కూడా ఉచిత హామీలు ఇస్తూ ఉండడం గమనార్హం. ఇటీవలకర్ణాటక,తెలంగాణా రాష్ట్రాలలో జరిగిన సాధారణ ఎన్ని కల సమయంలో కాంగ్రెస్, బిజెపి జాతీయ నాయకకత్వం పోటీలు పడీ ఉచిత హామీ లు ఇచ్చిన వైనం ఇంకా ప్రజలకు కళ్ళలో మెదులుతూనే ఉంది. రాష్ట్ర, జాతీయ రాజ కీయాలలో మరియు పరిపాలనలో సుదీర్ఘ అనుభవం కలిగి విజనరీ నాయకులుగా పేరు తెచ్చుకున్న నరేంద్ర మోదీ, నారా చంద్రబాబు నాయుడులు మొదట్లో ఉచితాల పై అయిష్టంగా ఉండేవారు. కానీ ఇటీవలి కాలంలో వారు కూడా పోటీలు పడీ మరీ అలివికాని ఉచిత హామీలు స్వయంగా ఇస్తూ ఉండడం ఆశ్చర్యకరం. కేవలం సంక్షేమ పథకాలు, ఉచితాలతోనే సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ అధినేత పవన్ కుమార్ చాంలింగ్ అయిదు పర్యాయాలు, ఒరిస్సాలో బిజూజనతాదల్ అధినేత నవీన్ పట్నాయక్ అయిదు పర్యాయాలు, పశ్చిమబెంగాల్‌లో సిపిఐ(ఎం)కు చెందిన జ్యోతీబసు వరుసగా అయిదు పర్యాయాలు ముఖ్యమంత్రులుగా, ఇటీవల పశ్చిమబెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వరుసగా మూడవ పర్యాయం ముఖ్యమంత్రిగా ఎన్నిక కాలే దనేది నిర్వివాద అంశం. గతంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులుగా ప్రాంతీయ పార్టీలు వ్యవహరించేవి. కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీలు అమలు చేసే అప్రజా స్వామిక పద్ధతులపై గతంలో ప్రాంతీయ పార్టీలు అలుపెరుగని పోరా టం చేసేవి. కానీ ఇటీవలి కాలంలో ప్రాంతీయ పార్టీలే అప్రజాస్వామిక పద్ధతులలో పెద్ద ఎత్తున పార్టీ పిరాయింపులకు ఎర్ర తివాచీ పరుస్తూ ఉన్నాయి. దీంతో ప్రాంతీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాలని నిలదీసే అవకాశాన్ని కోల్పోతూవున్నాయి. అదేవిధంగా గతంలో ప్రజలకు సేవ చేయాలని సదుద్దేశ్యంతోనే నూరు శాతం రాజకీయాలలోకి వచ్చేవారు. రాజకీయ పార్టీలు కూడా యువకులు, చదువు, ప్రతిభ, సేవాతాత్పరత కలిగిన వారినే రాజకీయాలలో ప్రోత్సహిస్తూ అటువంటి వారికే ఎన్నికల సమయం లో టికెట్లు కేటాయించేవి. అందుకు పూర్తి విరుద్ధంగా గెలుపు,అధికారమే ధ్యేయంగా అర్థ బలమే ప్రామాణికంగా రాజకీయ పార్టీలు ప్రస్తుతం టికెట్లు కేటాయించే పరిస్తితి ఆవిర్భవించింది. రాజకీయ పార్టీలు గ్రామ స్థాయిలో వార్డు మెంబర్ మొదలుకొని పార్ల మెంటు సభ్యుని వరకు ధనవంతులకే టికెట్లు కేటాయిస్తూ ఉండడంతో సామాన్యులు, నిస్వార్ధ పూరిత సేవాతత్పురత కలిగిన వారు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశమే లేకుండా పోయింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు, ప్రజాస్వామ్య విలువల రక్షణకు తీవ్ర విఘాతంగా పేర్కొనవచ్చు. అధికారం కొరకు ఈ విధంగా ధనవంతులను చట్టసభలకు పంపే సంస్కృతికి బీజం వేసింది కచ్చితంగా ప్రాంతీయ పార్టీలే. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రజా ప్రయోజనాల కొరకు ప్రాంతీయ పార్టీల అవసరం రాష్ట్రాలకే కాదు దేశానికి కూడా కచ్చితంగా ఉంది. కానీ అధికారం కొరకు రాష్ట్రాలను అప్పుల పాలు చేస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాలరాయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. కనుక ప్రాంతీయ పార్టీలు స్వీయ నియంత్రణతో అపసవ్యదిశ గమనం నుంచి సవ్యదిశగా ప్రయాణిస్తూ అధికారమే పరమావధిగా కాకుండా, ప్రజల ధనానికి ట్రస్టీలుగా భావించి ప్రజా ధనం వృదా చేయకుండా, ప్రజా శ్రేయస్సు, ప్రజా ప్రయోజనాల కొరకు చిత్తశుద్దితో పాటు పడినప్పుడే ప్రజలకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాష్ట్రాలకు, దేశానికి నిజంగా మంచి చేకూరుతుంది.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.



"కళ అనేది క్రమశిక్షణ నుండి స్వేచ్ఛ కాదు, క్రమశిక్షణతో కూడిన స్వేచ్ఛ."
జాన్ ఎఫ్. కెన్నెడీ



"మీరు ఊహను ఎంత ఎక్కువగా ఉపయోగిస్తే అంత ఎక్కువగా ఉంటారు."
మాయా ఏంజెలో



"ప్రతి కళాకారుడు మొదట ఒక ఔత్సాహికుడు."
రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

# అన్ని ఎన్నికల రికార్డులను తుడిచేస్తాం

● నీతీశ్ కుమార్ సారథ్యంలో మరోమారు ఎన్డీఏ సర్కారు ఏర్పాటు ఖాయం ● బీహార్‌లో ఎన్‌డీఏ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ ● ఫోన్లలోని టార్చ్ లైట్లను ఆన్‌చేసి మద్దతు తెలపమన్నప్రధానమంత్రి ● ఆధునిక గాడ్జెట్లు వచ్చాయ్..., ఇక లాంతర్లు అక్కర్లేదంటూ ఆర్‌జేడీపై వ్యాఖ్యలు ● బెయిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తులు నాయకత్వం వహిస్తున్న కూటమి మనకెందుకు ● మావోల పీచమణిచేందుకు చేస్తున్న కృషి ఫలిస్తోంది ● సమస్తిపూర్‌లో కర్పూరీ ఠాకూర్‌కు ప్రధాని నివాళి



పట్నా: బిహార్ సీఎం నీతీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి రాష్ట్రంలోని అన్ని ఎన్నికల రికార్డ్ను బ్రేక్ చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అదే సమయంలో ప్రతిపక్ష ఇండియా కూటమిని బెయిల్పై బయటకు వచ్చిన వ్యక్తులు నాయకత్వం వహిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతుల్లో పట్టుకొని తిరుగుతున్న నేతలే దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. వేల కోట్ల స్కామ్లు చేసి బెయిల్పై బయట తిరుగుతున్న ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు కూడా భారతరత్న కర్పూరీ ఠాకూర్ లాంటి మహనీయుడి బిరుదును పొందాలని తాపత్రయ పడుతున్నారని మోదీ విమర్శించారు. శుక్రవారం బిహార్లోని సమస్తీపూర్లోని జరిగిన ఎన్డీఏ కూటమి ప్రచార ర్యాలీలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభకు హాజరైన ప్రజలను వారివారి ఫోన్లలోని టార్చ్ లైట్లను ఆన్ చేయమని ప్రధానమంత్రి కోరారు. దీంతో అందరూ ఫోన్లలోని టార్చ్ లైట్లను ఆన్ చేసి చూపించారు. ప్రజలందరి చేతుల్లోకి ఆధునిక గాడ్జెట్లు వచ్చినందున, ఇక లాంతర్లు అక్కర్లేదని మోదీ వ్యాఖ్యానించారు. తద్వారా ఆర్జేడీ పార్టీ లాంతరు గుర్తుపై సెటైర్స్ వేశారు.


**బిహారీలపై ఆర్జేడీప్రతీకారాన్ని తీర్చుకుంది**

'2005 అక్టోబరులో జంగిల్ రాజ్ నుంచి బిహార్కు విముక్తి లభించింది. నీతీశ్ కుమార్ సారథ్యంలో రాష్ట్రంలో ఎన్డీఏ సర్కారు ఏర్పాటైంది. ఆ సమయానికి కేంద్రంలో కాంగ్రెస్ – ఆర్జేడీ కూటమి పాలన ఉండేది. నాటి కేంద్ర ప్రభుత్వం నీతీశ్ కుమార్ మార్గంలో చాలా అడ్డంకులను క్రియేట్ చేసింది. అయినప్పటికీ బలమైన సంకల్పంతో నీతీశ్ ముందుకు సాగారు. బిహారీలకు సుపరిపాలన అందించారు. నీతీశ్ కుమార్కు అనుకూలంగా ఓట్లు వేశారనే అక్కసుతో, నాటి కేంద్ర సర్కారులో ఉన్న ఆర్జేడీ పార్టీ బిహారీలపై ప్రతీకారాన్ని తీర్చుకుంది. బిహార్లోని నీతీశ్ కుమార్ సర్కారుకు ఏదైనా సాయం చేస్తే, కేంద్ర సర్కారుకు మద్దతును ఉపసంహరించుకుంటాం అని చెబుతూ కాంగ్రెస్ను కూడా ఆర్జేడీ బ్లాక్ మెయిల్ చేసింది' అని ప్రధాని మోదీ మండిపడ్డారు."2014లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చాక బిహార్లో అభివృద్ధి పనుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. విద్యుత్ సరఫరా చాలా మెరుగుపడింది. సరిపడా విద్యుత్ ఉంటే పరిశ్రమలు, వ్యాపారం పెరిగి నిరుద్యోగులకు అవకాశాలు వస్తాయి. బిహార్లోని ప్రతి రంగంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆస్పత్రులు, పాఠశాలలు నిర్మిస్తున్నారు. కొత్త రైల్వే మార్గాలు అందుబాటులోకి వస్తున్నాయి. వీటన్నింటికి ప్రధాన కారణం బిహార్లో సుస్థిర ప్రభుత్వం ఉండడం. స్థిరమైన ప్రభుత్వాలు ఉన్నప్పుడే అభివృద్ధి పుంజుకుంటుంది. బిహార్లో టెక్నాలజీ, స్టార్టప్ హబ్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. బిహార్ యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం తగ్గుతుంది. అయోధ్యలో రామమందిరం నిర్మించాం. శత్రువులపై ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. నక్సలిజం అంతం దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. ఇదంతా మీరు వేసిన ఒక్క ఓటుతోనే సాధ్యం. ఆ ఓటుతోనే ఇవన్నీ చేయగలిగాం." అని నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి అన్నారు.

**త్వరలోనే మావోయిజం నుంచి భారత్కు విముక్తి**

'మేం గత 11 ఏళ్లలో బిహార్కు ఆర్థిక సహాయాన్ని, బడ్జెట్ కేటాయింపులను మూడు రెట్లు పెంచాం. ప్రస్తుతం రాష్ట్రంలో పండే మఖానా విదేశాలకు ఎగుమతి అవుతోంది. బిహార్కు భారీ పెట్టుబడులు వస్తున్నాయి. భవిష్యత్తులో రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో స్టార్టప్లు ఏర్పాటవుతాయి. ప్రభుత్వం కేటాయించే ప్రతీ రూపాయిలో 15 పైసలే పేదలకు చేరుతున్నాయని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఒకసారి చెప్పారు. అప్పట్లో దారిమళ్లిన ప్రభుత్వ నిధులన్నీ రక్తపు పంజాలోకి వెళ్లేవి. కాంగ్రెస్, ఆర్జేడీ లాంటి పార్టీల పాలనలోనే అలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి.ఆర్జేడీ హయాంలోనే రాష్ట్రంలోని 18 జిల్లాల్లో మావోయిస్టులు బలపడ్డారు. ఫలితంగా వందలాది మంది హత్యలు జరిగాయి. అప్పట్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు భయపడేవారు. మేం 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చాక మావోయిజం వెన్ను విరిచాం. త్వరలోనే మావోయిజం నుంచి భారత్కు విముక్తి లభిస్తుంది. ఇది మోదీ ఇస్తున్న గ్యారంటీ' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు."అనేక దశాబ్దాలుగా దేశంలో, బిహార్లోని ప్రజలను నక్సలిజం ఇబ్బందులకు గురి చేసింది. మావోయిస్టుల సాయంతో ఎన్నికల్లో గెలిచారు. బిహార్ అభివృద్ధిని అడ్డుకోవడ నక్సలిజం కీలక పాత్ర పోషించింది.





పాఠశాలలు, కాలేజీలు, ఆస్పత్రులు తెరిచేందుకు నక్సలైట్లు అనుమతించలేదు. అప్పటికే ఉన్న వాటిని సైతం కూల్చివేశారు. పరిశ్రమలు వచ్చేందుకు అనుమతించలేదు. ఇలాంటి పరిస్థితుల నుంచి బిహార్ను బయటకు తెచ్చేందుకు చాలా కష్టపడుతున్నాం. 2014 నుంచి తీవ్రంగా శ్రమిస్తున్నాం. బిహార్ను జంగిల్ రాజ్ అంధకారం నుంచి ఎన్డీఏ బయటకు తెచ్చి అభివృద్ధి చేసింది. నక్సలిజాన్ని అంతం చేసే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. బిహార్ యువత భవిష్యత్తు కాపాడడం మా కర్తవ్యం. దాని కోసం మేము చాలా పట్టుదలతో పనిచేస్తున్నాం." అని నరేంద్ర మోదీ అన్నారు.

**వారికే అత్యంత ప్రాధాన్యత** : 'పేదలు, దళితులు, మహా దళితులు, బీసీలు, ఈబీసీలకు మేం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. జనరల్ కేటగిరీలోని పేదలకూ 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే కీలకమైన నిర్ణయాన్ని మా ప్రభుత్వమే తీసుకుంది. మరో పదేళ్ల పాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను పొడిగించింది కూడా మా ప్రభుత్వమే. పేదల కోసం దేశంలో మేం కొత్త ఉపాధి అవకాశాలను క్రియేట్ చేశాం' అని ప్రధాని మోదీ చెప్పారు.బిహార్లో మళ్లీ ఎన్డీఏ అధికారంలోకి వస్తే మహిళ సాధికారతలో కొత్త యుగం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జంగిల్ రాజ్లో మహిళలను నాలుగు గోడల మధ్యలో ఉంచారని ఆరోపించారు. అందుకే వారిని అధికారం నుంచి దూరంగా ఉంచడం చాలా ముఖ్యమని అన్నారు. తమ పాలనలో కోటి మందికి పైగా మహిళలు రూ. 10వేలు అందుకుని వ్యాపారాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇంకా అందుకోని మహిళల పేర్లు తీసుకుని వారితో చర్చించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నవంబర్ 14న ప్రభుత్వం వచ్చాక వారందరికీ ఇస్తామని హామీ ఇవ్వాలని తెలిపారు.

## ఫ్రాన్స్‌లోని మరో మ్యూజియంలో దోపిడీ..!



లావ్రే: ఫ్రాన్స్లో ప్రఖ్యాత లావ్రే మ్యూజియం లో చోరీ ఘటన యావత్ ప్రపంచాన్ని షాక్కు గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే ఫ్రాన్స్లో మరో మ్యూజియంలో దోపిడీ జరిగింది. ఈ ఘటనలో 2వేల బంగారు, వెండి నాణేలు అపహరణకు గురయ్యాయి.ది మైసన్ డెస్ లుమైరేస్ అనే మ్యూజియంలో దోపిడీ జరిగింది. లావ్రే మ్యూజియంలో చోరీ జరిగిన కొన్ని గంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం మ్యూజియం సిబ్బంది తలుపులు తెరిచేసరికి.. అక్కడ ప్రదర్శన అద్దాలు పగిలిఉండటాన్ని గుర్తించారు. దీంతో వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. అపహరణకు గురైన 2,000 వెండి, బంగారం నాణేలను 2011లో ప్రస్తుత మ్యూజియం ఉన్న భవనం పునరుద్ధరణ సమయంలో కనుగొన్నారు. అవి 1790, 1840 మధ్య నాటివని స్థానిక మీడియా పేర్కొంది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఇక, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మోనాలిసా ) అసలు చిత్రం ఉన్న లావ్రే మ్యూజియంలో ఆదివారం చోరీ జరిగిన సంగతి తెలిసిందే. ఇక్కడ దొంగిలించిన నగల విలువ దాదాపు రూ.895 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మ్యూజియంలో నిఘా కెమెరా పనితీరు సరిగ్గా లేదని డైరెక్టర్ లారెన్స్ డెస్ కార్స్ అంగీకరించారు. ఈ దోపిడీకి పాల్పడింది ఎవరనేది ఇప్పటివరకు తెలియలేదు. అయితే, కరుడుగట్టిన దొంగల ముఠా పింక్ పాంథర్స్ పని అయి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.

# హెచ్-1బీ వీసాల వల్లే

## అమెరికన్ల వేతనాలు తగ్గుతున్నాయ్

### వైట్ హౌస్ ప్రకటన




వాషింగ్టన్ : హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా.. కోర్టుల్లో పిటీషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా వైట్హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందించారు. ఈ హెచ్-1బీ వీసా వ్యవస్థల్లో మోసాలు జరుగుతున్నాయన్నారు.'ఈ వ్యాజ్యాలపై కోర్టులో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం. అమెరికన్ కార్మికులకు అవకాశాలు అందడంతో పాటు వీసా వ్యవస్థను బలోపేతం చేయడమే అధ్యక్షుడు ట్రంప్ తొలి ప్రాధాన్యం. చాలాకాలంగా హెచ్-1బీ వీసా వ్యవస్థ మోసాలతో నిండి ఉంది. అది అమెరికన్ల వేతనాలను తగ్గించింది. కాబట్టి ట్రంప్ ఈ వ్యవస్థను మెరుగుపరచాలనుకుంటున్నారు. ఈ చర్యలు చట్టబద్ధమైనవి. దీనిపై కోర్టులో పోరాడేందుకు సిద్ధం' అని ఆమె పేర్కొన్నారు. హెచ్-1బీపై ట్రంప్ నిర్ణయాన్ని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్ నిర్ణయం కాంగ్రెస్ తీసుకొచ్చిన సంక్లిష్టమైన వీసా వ్యవస్థను ఇది దెబ్బతీస్తోందని ఆ గ్రూప్ ఆందోళన వ్యక్తంచేసింది. హెచ్-1బీపై ఆధారపడిన వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని తన వ్యాజ్యంలో వాదించింది. ఇక పలు ఉద్యోగ సంఘాలు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అధ్యక్షుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ అమెరికా చట్టసభ సభ్యులు ఆయనకు లేఖ కూడా రాశారు. ట్రంప్ నిర్ణయం యూఎస్ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నైపుణ్యం కలిగిన వలసదారులను కోల్పోవాల్సి ఉంటుందని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

# ఆర్థర్ రోడ్ జైలుకు ఆర్థిక మోసగాడు మెహుల్ చోక్సీ

● బ్యారక్ నంబర్ 12లో విచారణ- భారత్ సన్నాహాలు! ● ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైలులో మెహుల్ చోక్సీ విచారణ ● బ్యారక్ నంబర్ 12లో ప్రత్యేక ఏర్పాట్లు- భారీ భద్రత నడుమ దర్యాప్తు ● త్వరలోనే బెల్జియం నుంచి భారత్‌కు తీసుకువచ్చే అవకాశం

న్యూఢిల్లీ : పరారీలో ఉన్న ఆర్థిక మోసగాడు, రూ.13,850 కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కామ్ నిందితుడు 66 ఏళ్ల మెహుల్ చోక్సీపై పెద్ద అప్డేట్ వచ్చింది. త్వరలో బెల్జియం నుంచి భారత్కు ఆయన్ను తీసుకురాగానే ఎక్కడ విచారిస్తారనే దానిపై క్లారిటీ వచ్చింది. ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైలులో ఆయన్ను ఉంచుతారని తెలిసింది. ఆ జైలులోని వసతులు, సౌకర్యాలకు సంబంధించిన ఫొటోలను ఇప్పటికే బెల్జియంలోని యాంట్వెర్ప్ నగర కోర్టుకు భారత్ సమర్పించినట్లు సమాచారం. పూర్తి భద్రత నడుమ, మానవ హక్కులకు భంగం కలగని రీతిలో చోక్సీని విచారిస్తామని కోర్టుకు భారత సర్కారు తెలిపింది. బెల్జియం కోర్టుకు భారత ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం మెహుల్ చోక్సీని ముంబయి ఆర్థర్ రోడ్ జైలులోని బ్యారక్ నంబర్ 12లో ఉంచుతారు. ఈ జైలులోని ఏ జనరల్ బ్యారక్లోనూ ఆయన్ను ఉంచరు. బ్యారక్ నంబర్ 12లో మంచి వెంటిలేషన్ ఉంటుంది. ఆ బ్యారక్కు పూర్తి భద్రతను కల్పించి, నిత్యం మానిటరింగ్ చేస్తారు. ఈ బ్యారక్లో 2 సెల్స్, ఒక టాయిలెట్ ఉన్నాయి.

**గతవారమే భారత్కు లైన్‌క్లియర్** : మెహుల్ చోక్సీని భారత్కు అప్పగించే ప్రతిపాదనకు బెల్జియంలోని యాంట్వెర్ప్ నగర కోర్టు గత శుక్రవారమే(అక్టోబరు 17న) ఆమోదముద్ర వేసింది. భారత్పై మెహుల్ చోక్సీ చేసిన కిడ్నాప్ అభియోగాలను సైతం కోర్టు తోసిపుచ్చింది. యాంట్వెర్ప్ నగర కోర్టు ఆదేశాలపై బెల్జియం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు చోక్సీకి ఈనెల 31 వరకు అవకాశం ఉంది. అప్పటిలోగా ఏం జరుగుతుంది? చోక్సీ ఏం చేస్తాడు? అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**భారత జైళ్లు అధ్వానం అంటూ పిటీ** : భారత్ నుంచి పరారై విదేశాల్లో ఉంటున్న ఆర్థిక మోసగాడు మెహుల్ చోక్సీని తమకు అప్పగించాలంటూ 2018లో ఇంటర్ పోల్కు సీబీఐ రెడ్ కార్నర్ నోటీసును జారీ చేసింది. ఆ సమయంలో ఇంటర్ పోల్లో చోక్సీ ఓ పిటిషన్ దాఖలు చేశాడు. భారత జైళ్లు అధ్వానంగా ఉంటాయని, అక్కడ మానవ హక్కుల అమలు సరిగ్గా జరగదని అందులో ఆరోపించాడు. ఒకవేళ మెహుల్ చోక్సీని తమకు అప్పగిస్తే, జైలులో ఏకాంతంగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్ల నడుమ అతడిని ఉంచుతామని ఇంటర్ పోల్కు భారత్ హామీ ఇచ్చింది. చోక్సీ హక్కులకు భంగం కలగకుండా దర్యాప్తు చేస్తామని భరోసా ఇచ్చింది.

**'భారత్ నుంచి ఆంటిగ్వాకు చోక్సీ పరార్'** : మెహుల్ చోక్సీ 2018 జనవరి 2న భారత్ నుంచి పారిపోయాడు. తొలుత అతడు ఆంటిగ్వా అండ్ బార్బుడా దేశంలో ఆశ్రయం పొందాడు. అక్కడ ఉండగా 2021 మే నెలలో హనీట్రాపింగ్ ద్వారా భారత ఏజెంట్లు తనను కిడ్నాప్ చేసి బలవంతంగా డొమినికా దేశానికి తరలించారని మెహుల్ చోక్సీ ఆరోపించారు. వాస్తవానికి ఆయనే ఆంటిగ్వా నుంచి డొమినికాకు పారిపోయినట్లు సమాచారం.

**'డొమినికాలో 51 రోజులు జైలులో'** : అక్రమంగా తమ దేశంలోకి ప్రవేశించారనే అభియోగాలతో డొమినికా పోలీసులు 2021 మే 23న చోక్సీని అరెస్టు చేశారు. 51 రోజుల పాటు డొమినికా దేశ జైలులో ఆయన ఉన్నాడు. అనంతరం వైద్య చికిత్సలు చేయించుకోవాల్సి ఉందంటూ ఆంటిగ్వాకు చోక్సీ తిరిగి వెళ్లారు. ఆ తర్వాత ఆయనపై ఉన్న కేసును డొమినికా దేశ కోర్టు కొట్టివేసింది. 2022 జూన్లో కిడ్నాప్ ఆరోపణలతో భారత ప్రభుత్వం, భారత ఏజెంట్లపై ఆంటిగ్వాలో మెహుల్ చోక్సీ కేసులు పెట్టారు. ఆ ఆరోపణలన్నీ అవాస్తవాలని భారత సర్కారు అప్పట్లోనే అక్కడి కోర్టుకు వివరణ ఇచ్చింది.



**బెల్జియం మీదుగా స్విట్జర్లాండ్కు పారిపోయే యత్నం** : ఆంటిగ్వా నుంచి చోక్సీని స్వదేశానికి తీసుకొచ్చే యత్నాలను భారత సర్కారు వేగవంతం చేసింది. ఈ విషయం తెలియడంతో బెల్జియం మీదుగా స్విట్జర్లాండ్కు పారిపోవాలని ఆయన భావించారు. దీనిపై భారత నిఘా వర్గాలకు పక్కా సమాచారం అందింది. ఈ వివరాలను బెల్జియం పోలీసులకు భారత్ చేరవేసింది. చోక్సీ ఉంటున్నాడని తెలిపింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 14న బెల్జియం పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు.

# ఉగ్ర నిరోధక చట్టాలను పాక్‌దుర్వినియోగం

## ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్



బలోచ్: ఉగ్రవాద నిరోధక చట్టాలను పాక్ దుర్వినియోగం చేస్తోందని మానవహక్కుల సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చట్టాలను బలోచ్ ఉద్యమకారుల అణచివేతకు వాడుతోందని ఆరోపించింది. 1997 ఉగ్రవాద నిరోధక చట్టం కింద బలోచ్కు చెందిన 32 మందిని పాక్ తన వాచ్లిస్టో చేర్చడాన్ని తప్పుబట్టింది. వారిలో ప్రత్యేక దేశం కోసం పోరాడే వారిని కూడా చేర్చిందని.. ఇది వారి హక్కులను పూర్తిగా కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమ్నెస్టీ దక్షిణాసియా రీజనల్ డైరెక్టర్ బాబూ రామ్ మాట్లాడుతూ.. ప్రత్యేక దేశం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న బలోచ్ ప్రజలను పాక్ ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తోందన్నారు. దీనివల్ల వారి స్వేచ్ఛ, గోప్యత, ఉద్యమానికి సంబంధించిన ప్రాథమిక హక్కులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. పాక్ తన వాచ్లిస్టో పలువురు మహిళా బలోచ్ కార్యకర్తల పేర్లను కూడా చేర్చి.. తన హద్దులను దాటిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనివల్ల వారు కఠినమైన పర్యవేక్షణ, ప్రయాణ ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని, వారి బ్యాంకు ఖాతాలు కూడా ఫ్రీజ్ అవుతాయని పేర్కొంది. బలోచ్ ఉద్యమకారులకు వ్యతిరేకంగా పాక్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం కూడా వారికి లేకుండా ఉండేందుకు ఉగ్రవాద నిరోధక చట్టాలను ఉపయోగిస్తోందని తెలిపింది. పాక్ చేస్తున్న ఇటువంటి కుట్రలను అడ్డుకోవాలంటే అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలకు అనుగుణంగా ఆ దేశం ఉగ్రవాద నిరోధక చట్టాలను సవరించాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది.బలోచిస్థాన్ ప్రాంతాన్ని ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడం కోసం బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఏర్పడింది. పాక్లోని అత్యధిక ఖనిజ నిల్వలున్న ప్రావిన్సా బలోచిస్థాన్ను పేర్కొంటారు. ఇక్కడ చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయువు తదితర వనరులు పుష్కలంగా ఉన్నాయి. దీంతో ప్రత్యేక దేశం కోసం బలోచ్ ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతున్నారు.

## శబరిమల బంగారం వివాదం- అసలు దొంగలు వీరే

● సిట్ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి! ● బంగారు తాపడాల నుంచి వేరు చేసిన స్వర్ణం ● బళ్లారిలోని బంగారు వ్యాపారి గోవర్ధన్‌కు విక్రయించినట్లు నిర్ధారించిన సిట్





తిరువనంతపురం : శబరిమల అయ్యప్ప దేవాలయంలోని బంగారు తాపడాల కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) తాజాగా ఈ కేసులో గణనీయమైన పురోగతిని సాధించింది. బంగారు తాపడాల నుంచి వేరు చేసిన స్వర్ణాన్ని బళ్లారిలోని నగల వ్యాపారి గోవర్ధన్కు విక్రయించినట్లు, ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి తన వాంగ్మూలంలో వెల్లడించాడు.అయితే ఈ విషయంపై విచారణ జరిపించడం కోసం నగల వ్యాపారి గోవర్ధన్ను సిట్ తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్ కార్యాలయానికి పిలిపించింది. ఆ విచారణలో ఉన్నికృష్ణన్ పొట్టి దేవస్థానానికి చెందిన బంగారాన్ని తనకు విక్రయించాడని గోవర్ధన్ అంగీకరించాడు. దీంతో కనిపించకుండా పోయిన దాదాపు 476 గ్రాముల బంగారాన్ని తిరిగి రికవరీ చేయాలని దర్యాప్తు బృందం నిర్ణయించింది. అమ్మిన బంగారాన్ని తిరిగి పొందడానికి సిట్ బృందం, ఉన్నికృష్ణన్ పొట్టిని బెంగళూరుకు తీసుకెళ్లింది.

**బంగారానికి బదులు రాగి అని నమోదు చేసిన అధికారి!**

ఇదిలా ఉండగా ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న దేవస్వం మాజీ పరిపాలన అధికారి బి.మురారి బాబు, 2019లో దేవస్థానం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్గా ఉన్న సమయంలో బంగారానికి బదులు రాగి అని నమోదు చేసినట్లు సిట్ గుర్తించింది. తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలో సిట్ బృందం ఆయన్ను విచారించగా, ఉద్దేశపూర్వకంగా తాను అలా చేసినట్లు మురారి బాబు అంగీకరించాడు. దీంతో ఆయన్ను రన్నీ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరిచారు. 1998లో విగ్రహాలకు బంగారు పూత పూసినట్లు మురారి బాబుకు ముందే తెలుసునని దర్యాప్తు బృందం తమ నివేదికలో పేర్కొంది. అంతేకాదు మురారి బాబు బంగారు రేకులను అక్రమంగా రవాణా చేయడంలో ఉన్నికృష్ణన్ పొట్టికి సహాయం చేశాడని సిట్ భావిస్తోంది. బంగారు రేకులను రాగిగా నమోదు చేసి, దాదాపు రెండు కిలోల బంగారాన్ని కొట్టేయాలనే మాస్టర్ ప్లాన్లో భాగంగా ఇది చేశారని సిట్ బృందం అనుమానిస్తోంది.

# రష్యాలో భారీగా పెరిగిన సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు



మాస్కో : రష్యా ప్రధాన చమురు సంస్థలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ముడిచమురు కొనుగోలుదారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో చమురు రవాణా చేసే సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు అమాంతం పెరగడం గమనార్హం. మధ్య ప్రాచ్యం-చైనా మార్గంలో ఈ ట్యాంకర్ల ఛార్జీలు ఒక్కరోజే 16 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.పుతిన్ అనుచితంగా చేస్తున్న యుద్ధానికి ప్రతిగా రష్యాలోని అతి పెద్ద చమురు కంపెనీలు రాస్నెఫ్ట్, లుకాయిల్లపై ఆంక్షలను విధిస్తున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ బుధవారం ప్రకటించారు. దీంతో ఈ సంస్థల నుంచి ప్రధానంగా చమురు కొనుగోళ్లు జరుపుతోన్న భారత, చైనీస్ రిఫైనరీలు అప్రమత్తమయ్యాయి. రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించుకోవాలని ఈ కంపెనీలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో డిమాండ్కు అనుగుణంగా చమురు దిగుమతి కోసం మధ్యప్రాచ్యం వైపు చూస్తున్నట్లు సమాచారం.రష్యాపై ఆంక్షల కొరడా.. 2 అతి పెద్ద చమురు సంస్థలపై అమెరికా నిషేధంఈ పరిణామాలతో మధ్యప్రాచ్యం-చైనా మార్గంలో త్వరలో ముగియనున్న ఫ్రీట్ అగ్రిమెంట్లకు సంబంధించి సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు గురువారం 16శాతం పెరిగినట్లు బాల్టిక్ ఎక్స్ఛేంజ్ డేటా వెల్లడించింది. ట్యాంకర్ల ఛార్జీలు ఈ స్థాయిలోకి రావడం 2023 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. డిసెంబరు కాంట్రాక్టులకు సంబంధించిన ఛార్జీలు కూడా దాదాపు 13శాతం పెరిగినట్లు తెలుస్తోంది.రష్యా కంపెనీలు, వాటికి అనుబంధంగా పని చేసే డజన్ల కొద్దీ కంపెనీలపైనా ఆంక్షలు అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. అటు ఈయూ కూడా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఇవన్నీ నవంబరు 21వ తేదీ నుంచి అమల్లోకి వచ్చే అవకాశముంది. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ డేటా ప్రకారం.. రష్యా ఆగస్టులో ప్రతి రోజు 7.3 మిలియన్ బ్యారెళ్ల ఇంధనాన్ని ఎగుమతి చేసింది. ప్రపంచ ముడిచమురు, రిఫైన్డ్ ఇంధన వినియోగంలో ఇది దాదాపు 7శాతానికి సమానం కావడం గమనార్హం.

# మైనార్టీ యువతకు "జర్మనీ"లో ఉద్యోగ అవకాశాలు

● ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం ● నవంబర్ 2వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం ● నెలకు రూ.2.60 లక్షలుపైబడి జీతం ● రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి రాష్ట్రంలోని మైనారిటీ యువతకు జర్మనీ దేశంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను కూటమి ప్రభుత్వం నేతృత్వంలో కల్పిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.ఏపీ ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ( ఏపీ ఎస్ ఎస్ డి సి ), ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ( ఓ ఎం సి ఏ పి ), ఐ ఈ ఎస్ ల సహకారంతో, జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.రెండు సంవత్సరాల ఐటిఐ లేదా మూడు సంవత్సరాల ఎలక్ట్రీషియన్ ట్రేడ్ విద్యార్హతతో ఉత్తీర్ణత సాధించిన వారు జర్మనీ ఉద్యోగాలకు అర్హులన్నారు.వయో పరిమితి గరిష్టంగా 30 సంవత్సరాలు లోపు ఉన్నవారు,కనీసం రెండేళ్ల సంబంధిత ఎలక్ట్రీషియన్ పనులలో అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**నెలకు 2.60 లక్షలు పైబడిన జీతంతో ఉద్యోగాలు**

జర్మనీ దేశంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి భారీగా జీతం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు.నెలకు 2,600 నుండి 2,700 యూరోలు ( భారత కరెన్సీలో రూ. 2.60 లక్షల నుండి రూ.2.70 లక్షలు) జీతం పొందవచ్చునని అన్నారు.రెండేళ్ల ఒప్పందం మేరకు జర్మనీలో ఉద్యోగాలు చేసుకోవడానికి వీలు ఉందని తెలిపారు.ఒప్పందం ప్రకారం అదనపు పనికి అదనపు జీతం, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు.జర్మనీలో అవసరమయ్యే అక్కడి స్థానిక గుర్తింపు, అనువాద ఖర్చులను యజమాని భరిస్తారని, వసతి,రాక (ఆరైవల్) సహాయంను అక్కడ యజమాని అందిస్తారని తెలిపారు.జర్మనీలో 6 నెలల ప్రొబేషన్ కాలం పూర్తయిన తర్వాత 1000 యూరోలు తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు.

**నవంబర్ నుండిజర్మనీ భాష పై శిక్షణ**

జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అర్హులకు జర్మనీ భాషపై పట్టు సాధించేందుకు వీలుగా ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు మంత్రి ఫరూక్ తెలిపారు. దాదాపు 12 లేదా 14 వారాల పాటు జర్మన్ భాష లోని ఏ-1,ఏ-2 స్థాయిల వరకు



క్లాస్ రూమ్ శిక్షణ ను తాత్కాలికంగా రాజమండ్రి లో ఏర్పాటు చేసి రోజుకి 8 గంటలపాటు ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందుకు ఖర్చును అభ్యర్థులే భరాయించాల్సి ఉంటుందని వెల్లడించారు.దరఖాస్తు, శిక్షణ కోసం ఫీజు రూ.1.15 లక్షలు ను మూడు వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుందన్నారు.విమాన,వీసా తదితర ఛార్జీలు కూడా అభ్యర్థు లు స్వయంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. జర్మనీలో ఉద్యోగాల కోసం నవంబర్ 2వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. చెల్లుబాటు అయ్యే పాస్ పోర్టు, గతంలో పనిచేసిన కంపెనీల నుండి రిలీవింగ్ లెటర్,సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మైనారిటీ అభ్యర్థులందరూ వారి యొక్క బయోడేటా స్కిల్ ఇంటర్నేషనల్ ఏపీ ఎస్ ఎస్ డి సి. ఇన్ కు ఆన్లైన్ ద్వారా పంపించాలని .

# ఆర్జేడీతో చేతులు కలపడంనా పొరపాటే

● ప్రధాని ర్యాలీలో నీతీశ్ కీలక వ్యాఖ్యలు ● సమస్తిపుర్ జిల్లాలో విపక్ష పార్టీపై ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ విమర్శలు



పట్నా: ఇండియా కూటమితో పొత్తు పెట్టుకోవడం తాను చేసిన అతి పెద్ద పొరపాటని, ఆలస్యంగా ఆ తప్పును గ్రహించానని బిహార్ సీఎం నీతీశ్ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సమస్తిపుర్లో నిర్వహించిన ర్యాలీలో ప్రధాని మోదీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీపై తీవ్రమైనన విమర్శలు గుప్పించారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తున్న ఉదార సహాయంతో బిహార్ పురోగతి సాధిస్తోందని నీతీశ్ ఉద్ఘాటించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏకు ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. 1997లో దాణా కుంభకోణం కేసుల్లో సీబీఐ ఛార్జిషీట్ తర్వాత సీఎం పదవికి ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ రాజీనామా చేయడం, ఆయన భార్య రబ్రీ దేవి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించడం గురించి నీతీశ్ ప్రస్తావించారు. రాష్ట్రాన్ని సరియైన దిశలో పాలించక "పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చినప్పుడు, ఆయన భార్యకు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారని" ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ పేరు ఎత్తకుండానే ఆయన్ను విమర్శించారు. "లాలూ ప్రసాద్ తీరును మార్చుకోలేదు. ఒకప్పుడు భార్యను ఆసరాగా చేసుకున్న ఆయన, ఇప్పుడు పిల్లలకు మద్దతు ఇవ్వడంలో బిజీగా ఉన్నాడు" .

# కాళరాత్రిలో మృత్యు పయనం



**20 మంది అగ్నికి ఆహుతి... 19 మంది క్షతగాత్రులు - బైక్ ఢీకొనటమే ఘటనకు కారణమంటున్న సాక్షులు**

**ఘటనా స్థలాన్ని సందర్శించిన ఏపీ మంత్రులు - దుర్ఘటనపై ఏపీ సిఎం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష - కర్నాటక, తెలంగాణ మంత్రులతో సమన్వయం చేసుకుంటున్నామన్న హెూంమంత్రి అనిత - బాధితులకు నష్టపరిహారం ప్రకటించిన తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి**

**ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు (కావేరి ట్రావెల్స్)ను కర్నూలు శివారులోని చిన్నటేకూరులో హైవే 44పై బైక్ ఢీకొట్టింది. తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో బైక్ బస్సు కిందకు దూసుకెళ్లడంతో మంటలు చెలరేగాయి. క్రమంగా అవి బస్సు మొత్తం వ్యాపించాయి. చూస్తుండగానే బస్సు అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 44 మంది ఉండగా, 19 మంది సజీవ దహనమయ్యారు. మృతిచెందిన వారిలో ఆరుగురు తెలంగాణ వాసులున్నారు. మరిన్ని వివరాలలోకి వెళితే...**

కర్నూలు శివారులోని చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ఇప్పటి వరకు 20 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారి మృతదేహాల వెలికితీత ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో మొత్తం 23 మంది ప్రయాణికులు క్షేమంగా ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, ఇంకా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

బస్సు ప్రమాదానికి గురైన సమయంలో.. స్థానికులు వెంటనే స్పందించినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరగ్గానే అటుగా వెళ్తున్న ఓ మహిళ.. వీడియో తీసి, పోలీసులకు సమాచారం అందించినట్లు సమాచారం. వీడియో పోలీసులకు షేర్ చేయడంతో.. వారు ప్రమాద తీవ్రతను గుర్తించి.. వెంటనే అన్ని విభాగాలనూ అప్రమత్తం చేసినట్లు తెలుస్తోంది. అలాగే అదే మార్గంలో వెళ్తున్న ఓ వ్యక్తి.. గాయపడిన ఓ వ్యక్తిని తన కారులో ఎక్కించుకుని సమీప ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది

**ప్రమాద వివరాలు**

బస్సు పటాన్ చెరులో రాత్రి 9.30 గంటల సమయంలో బయలుదేరి, హైదరాబాద్‌లోని వివిధ స్టాపుల్లో ప్రయాణికులను ఎక్కించుకుని బెంగళూరుకు బయలుదేరింది. చిన్నటేకూరు వద్ద బస్సు కింద ఒక ద్విచక్ర వాహనం చిక్కుకుపోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వేగంగా వ్యాపించిన మంటల ధాటికి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం సమయంలో బస్సులో 42 మంది ప్రయాణిస్తున్నారని, కేవలం 12 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడగలిగారని స్థానికులు చెబుతున్నారు. బస్సులో చిక్కుకున్న ప్రయాణికులు మంటల్లో కాలిపోయినట్లు తెలుస్తోంది.

**సంచలన విషయాలు వెలుగులోకి**

ఈ ఘోర ప్రమాదానికి కారణమైన 'వేమూరి కావేరీ' ట్రావెల్స్ బస్సుపై పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా బస్సును నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ బస్సు ఫిట్‌నెస్ వాలిడిటీ ఈ ఏడాది మార్చి 31వ తేదీతోనే ముగిసింది. అంతేకాక ఈ బస్సు ఇన్సూరెన్స్, పొల్యూషన్ వాలిడిటీ గత ఏడాది ఏప్రిల్ నెలలోనే ముగిశాయి. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ గడువు ముగిసిన బస్సును నడపడం, అతివేగం కారణంగానే ఈ ఘోరం జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు.

**ప్రయాణీకుల ఫోన్లు స్విచ్చాఫ్**

ఈ బస్సులో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఎక్కారు. కూకట్‌పల్లి నుంచి ఏడుగురు ఎక్కగా, వారిలో హర్ష, రామిరెడ్డి, సూర్య ప్రాణాలతో బయటపడ్డారు. ధాత్రి, చందన, మంగా, అమృత్ కుమార్ అనే ప్రయాణికుల ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయి. సూరారం నుంచి ఎక్కిన గుణ సాయి క్షేమంగా ఉన్నారు. బహదూర్‌పల్లిలో బస్సు ఎక్కిన సుబ్రహ్మణ్యం సురక్షితంగా బయటపడగా, అదే ప్రాంతానికి చెందిన ప్రశాంత్ ఫోన్ కలవడం లేదు. గండిమైసమ్మ చౌరస్తా వద్ద ఎక్కిన సత్యనారాయణ, చింతల్‌లో ఎక్కిన వేణు గుండాల ఫోన్లు కూడా స్విచ్ ఆఫ్ అని వస్తుండటంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ వారి ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు



**తెలంగాణ సర్కార్ 5 లక్షల పరిహారం**

పాలెం' ప్రమాదం రిపీట్..ఈ బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు తెలంగాణ సర్కార్ రూ.5 లక్షలు, అదేవిధంగా క్షతగాత్రులకు రూ.2 లక్షల పరిహారం ప్రకటించినట్లుగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు

**చనిపోయిన వారు వీరే..**

ఎం.సత్యనారాయణ – సత్తుపల్లి, ఖమ్మం జిల్లా
జయసూర్య – మియాపూర్, హైదరాబాద్
నవీన్ కుమార్ – హయత్‌నగర్, హైదరాబాద్
సరస్వతీ, నిహారిక – బెంగళూరు
నీలకుర్తి రమేశ్, ఆయన భార్య అనూష , కుమార్తె మన్విత , కుమారుడు యశ్వంత్ – కొత్తపేట, నెల్లూరు జిల్లా
కాపరి అశోక్, కాపరి శ్రీహర్ష – నెల్లూరు
వీరితో పాటు చనిపోయిన మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది.

**కార్యాలయాలు మూసేసిన బస్ యాజమాన్యం**

ఈ ఘోర ప్రమాదం నేపథ్యంలో వి కావేరి ట్రావెల్స్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని తమ కార్యాలయాలన్నింటినీ మూసివేసింది. ఘటన జరిగినప్పటి నుంచి యాజమాన్యం అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. అంతేకాకుండా, ప్రమాదానికి గురైన బస్సుపై గతంలో తెలంగాణలో రెండుసార్లు రాష్ డ్రైవింగ్ చలాన్లు విధించినట్లు సమాచారం.

**హైదరాబాద్‌కు చెందిన వారే ఎక్కువ**

ఘటన సమయంలో పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హైమ రెడ్డి అనే మహిళ బస్సులో మంటలు చెలరేగడాన్ని గమనించారు. ఆమె వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను కర్నూల్? సర్వజన ఆసుపత్రికి తరలించారు. హిందూపూర్‌కు చెందిన నవీన్ అనే వ్యక్తి గాయాలైన వారిలో ఆరు మందిని తన కారులో ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఇద్దరు డ్రైవర్లు అక్కడి నుంచి పరారయ్యారు. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్?కు చెందిన వారు ఉన్నట్లు సమాచారం.

**గొట్టిపాటి నాగేశ్వరరావు**
**–స్టేట్ బ్యూరో ప్రత్యేక ప్రతినిధి, 70360 00444**

## రన్నింగ్ బస్సులో మంటలు చెలరేగితే ఏం చేయాలి?



బస్సులో మంటలు చెలరేగడం అనేది క్షణాల్లో జరుగుతుంది. కానీ, కాస్త ప్రశాంతంగా ఉండాలి. త్వరగా రియాక్ట్ కావడం వల్ల ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. రన్నింగ్ బస్సులో మంటలు చెలరేగితే ఎలా తప్పించుకోవాలో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

**ప్రశాంతంగా ఉండండి :** ముందుగా భయపడకుండా ఉండాలి. భయాందోళన అనేది ఎలా బయటపడాలో ఆలోచించే శక్తిని లేకుండా చేస్తుంది.

**డ్రైవర్‌ను హెచ్చరించండి :** ఒకవేళ బస్సులో పొగ, మంటలు చూసినా, కాలుతున్నట్లు వాసన వచ్చినా, వెంటనే డ్రైవర్ ను అలర్ట్ చేయాలి.

**ఎగ్జిట్ వైపు వెళ్లాలి:** ఒకవేళ బస్సులో మంటలు వస్తున్నట్లు గమనిస్తే వెంటనే ఎమర్జెన్సీ ఎగ్జిట్ వైపు వెళ్లాలి. ఇతరులను నెట్టకుండా, పరిగెత్తకుండా తప్పించుకునే ప్రయత్నం చేయాలి. ఒకవేళ మెయిన్ డోర్ క్లోజ్ అయితే, మరో ఎగ్జిట్ ను కనుగొనాలి.

**ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ను ఉపయోగించండి:** రెడ్ కలర్ హ్యాండిల్స్ తో కూడిన ఎమర్జెన్సీ ఎగ్జిట్ ను ఓపెన్ చేయాలి. అక్కడ ఉన్న సూచనలు పాటించి తెరవాలి. మీరు ఒక్కరే తెరవకపోతే, ఇతరుల సాయం తీసుకోవాలి.

**పొగనుంచి తప్పించుకోండి :** పొగ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయండి. వంగి లేదంటే పాకుతూ వెళ్లండి. పొగ పీల్చకుండా ఉండేందుకు మీ ముక్కు, నోటికి గుడ్డను అడ్డంగా పెట్టుకోవాలి.

**వస్తువుల కోసం వెతకకండి:** బ్యాగులు, వ్యక్తిగత వస్తువులను కోసం ప్రయత్నించకూడదు. ప్రాణాలు ముఖ్యంఅని గుర్తుంచుకోవాలి. మీరు సుక్షితంగాఉంటే పిల్లలు, వృద్ధులు, మహిళలకు సాయం చేయండి.

**బస్సుకు దూరంగా ఉండండి :** బస్సులో మంటలు చెలరేగిన తర్వాత పేలుళ్లు జరిగే అవకాశం ఉంటుంది. అందుకే, బస్సుకు దూరంగా ఉండాలి.

**ఎమర్జెన్సీ సిబ్బందికి కాల్ చేయండి :** మీరు సురక్షితంగా బటయపడితే వెంటనే ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించాలి. ప్రమాద స్థలం గురించి చెప్పాలి. ఈ సూచనలు పాటించడం వల్ల బస్సులో మంటలు చెలరేగినప్పుడు సురక్షితంగా బయటపడే అవకాశం ఉంటుంది..

## ఒకే కుటుంబంలో నలుగురు మృతి



ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గోళ్లవారిపల్లికి చెందిన గోళ్ల రమేశ్ (35), ఆయన భార్య అనూష (32), కుమారుడు యశ్వంత్ (8), కూతురు మన్విత (6) మృతి చెందారు. బెంగళూరులో స్థిరపడిన ఈ కుటుంబం హైదరాబాద్ వెళ్లి తిరిగి బెంగళూరు వస్తుండగా ప్రమాదంలో మరణించారు. వీరి మరణం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

## సరిగ్గా 12 సంవత్సరాల క్రితం..

అక్టోబర్ 30, 2013లో బెంగళూరు నుంచి 51 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్కు చెందిన వోల్వో బస్సులో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. బస్సు ఓ కారును ఓవర్టేక్ చేస్తుండగా.. అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో డీజిల్ ట్యాంక్ లీక్ అయి పేలుడు సంభవించడంతో ఆ దుర్ఘటనలో మొత్తం 45 మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. వారిలో అంతా సాఫ్ట్వేర్ ఇంజినీర్లే ఉన్నారు. ఈ ప్రమాదంలో కేవలం బస్సు డ్రైవరుతో పాటు క్లీనర్, ఐదుగురు ప్రయాణికులు మాత్రమే మృత్యుంజయులుగా బయటపడ్డారు.

**సీఐడీ ఎంక్వైరీ..** మహబూబ్నగర్ జిల్లా పాలెం వద్ద జరిగిన వోల్వో బస్సు దుర్ఘటనపై సీఐడీ పోలీసులు కేంద్రానికి 400 పేజీల నివేదికను సమర్పించారు. బస్సు ప్రమాదానికి గల పలు కారణాలను అందులో పొందుపరిచారు. ఛార్జ్‌షీటులో నాడు ఆర్ అండ్ బీ అధికారులు, జబ్బార్ ట్రావెల్స్, జేసీ ప్రభాకర్రెడ్డి సతీమణి పేర్లను కూడా చేర్చారు. వోల్వో బస్సుల తయారీలోనే లోపాలు ఉన్నాయని, ఆ నివేదికలో అధికారులు వెల్లడించారు. నిబంధనలను విరుద్ధంగా బస్సులో సీట్లను మార్చేశారని రిపోర్టులో తెలిపారు. టైర్లకు సమీపంలోనే ఇంధన ట్యాంకులు ఉండటం వల్లే బస్సుకు త్వరగా మంటలు వ్యాపించాయని నిర్ధారించారు. ఆ డీజిల్ ట్యాంక్ కూడా ఘోర ప్రమాదానికి కారణమని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ లోపం, సీట్లు పెంచడం, బస్సులో ఓవర్ లోడ్ లగేజీ, ప్రమాదకర వస్తువులు ప్రమాదానికి కారణమని సీఐడీ అధికారుల విచారణలో వెల్లడైంద




suryachitramagazine@gmail.com

విజయవాడ
శనివారం
25 అక్టోబర్ 2025



సూర్య సినిమా

# 'స్పిరిట్' వన్ బ్యాడ్ హ్యాబిట్ సౌండ్-స్టోరీ



వరుస పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్‌లతో అగ్రస్థానంలో కొనసాగుతున్న రెబెల్ స్టార్ ప్రభాస్, ఇప్పుడు తన బిగ్గెస్ట్ వెంచర్ 'స్పిరిట్' కోసం సిద్ధమవుతున్నారు. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డివంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. తొలి మూడు సినిమాలతోనే హ్యాట్రిక్ హిట్స్ అందుకున్న సందీప్ రెడ్డి వంగా ఈసారి ప్రభాస్‌తో చేతులు కలిపి పాన్-వరల్డ్ లెవల్‌లో యాక్షన్ స్పెక్టకిల్‌ని రూపొందిస్తున్నారు. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా టీం ఒక యూనిక్ ఆడియో టీజర్ SOUND-STORYని విడుదల చేసింది. ఇందులో విజువల్స్ లేవు, కానీ ప్రభాస్, ప్రకాశ్ రాజ్ మధ్య జరిగే ఇంటెన్స్ డైలాగ్స్ కట్టిపడేశాయి. కథ ప్రకారం, ప్రభాస్ ఒక అకాడమీ టాపర్ ఐపీఎస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. కానీ ఓ కారణం చేత రిమాండ్‌లో జైలుకి వెళ్తాడు. అక్కడ జైలర్‌గా ఉన్న ప్రకాశ్ రాజ్ అతనికి సరైన పాఠం నేర్పించాలని నిర్ణయిస్తాడు. ఆ సందర్భంలో అతనికి జైలుజెర్సీ ధరించమని ఆదేశిస్తే, ప్రభాస్ కూల్‌గా "చిన్నప్పటి నుండి నాకు ఒక బ్యాడ్ హాబిట్ ఉంది' అని చెప్పడం అదిరిపోయింది. ఈ ఒక్క లైన్‌తోనే ప్రభాస్ పాత్ర ఎంత ఇన్‌టెన్స్‌గా, పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతుంది. అలాగే ప్రకాశ్ రాజ్ పాత్ర కూడా బలంగా ఉండనుంది. విజువల్స్ లేకుండానే ఉత్కంఠను రేపిన ఈ SOUND-STORY టీజర్ అభిమానులకు యూనిక్ బర్త్‌డే గిఫ్ట్‌గా నిలిచింది. 'యానిమల్' సినిమాలో తన అద్భుత నటనతో ఆకట్టుకున్న త్రుప్తి దిమ్రి ఈసారి ప్రభాస్ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది. బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్,లి అర్జున్ రెడ్డి'లో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటి కాంచన ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది భాషల్లో విడుదల కానున్న 'స్పిరిట్' ట్రూ గ్లోబల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌గా రూపొందనుంది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ-సిరీస్ బ్యానర్స్‌పై ప్రణయ్ రెడ్డివంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్ళనుంది.




గాడ్ ఆఫ్ ది మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలా బరేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజా 'అఖండ 2: తాండవం'. ఇది వారి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ అఖండకు సీక్వెల్. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తు న్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్ ద్వారా లెజెండ్ అఖండ పాత్రను పరిచయం చేసిన ఫస్ట్ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పు డు బాలకృష్ణ మరో పాత్రను పరిచయం చేయడానికి మేకర్స్ అఖండ 2: బ్లాస్టింగ్ రోర్ టైటిల్ తో మరో ఎలక్ట్రిఫైయింగ్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ వీడియోలో బాలకృష్ణ పూర్తి స్థాయి మాస్ అవతార్‌లో హై-వోల్టేజ్ యాక్షన్ తో అదరగొట్టారు. బోయపాటి శ్రీను తన సిగ్నేచర్ స్టైల్‌లో బాలయ్యని లార్జర్ దెన్ లైఫ్ మూమెంట్స్‌తో అద్భుతంగా ప్రజెంట్ చేశారు. బాలయ్య గర్జన సింహంలా వినిపించగా, ఆయన డైలాగ్ డెలివరీ, యాక్షన్ బ్లాక్స్ అదిరిపోయాయి. చివర్లో ఆయన కాలు మోపగానే గుర్రాలు భయంతో దూకడం పక్కా మాస్ ఎలివేషన్. "సౌండ్ కంట్రోల్‌లో పెట్టుకో. ఏ సౌండ్ కి నవ్వుతానో, ఏ సౌండ్ కి నరుకుతానో నాకే తెలియదు. ఊహకి కూడా అందదు' అని బాలకృష్ణ చెప్పిన డైలాగు గూజ్ బంప్స్ తెప్పించింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్‌ల యాక్షన్ కొరియోగ్రఫీ అద్భుతంగా ఉండగా, ఎస్. థమన్ అందించిన బిజిఎమ్ పవర్‌ఫుల్‌గా ఉంది. విజువల్స్, ప్రొడక్షన్ వాల్యూస్ అత్యున్నత స్థాయిలో వున్నాయి. ఈ కొత్త టీజర్‌తో, అఖండ 2: తాండవం కోసం అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు.



# శ్రీలంకలో రామ్‌చరణ్ జాన్వి



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్, సుకు మార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మ కంగా సమర్పిస్తున్నాయి. తాజాగా రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా, యూనిట్ సభ్యులు నెక్స్ట్ షెడ్యూల్ కోసం శ్రీలంకకు బయలుదేరారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఈ షెడ్యూల్‌లో అందమైన ప్రదే శాల్లో రామ్ చరణ్ జాన్వీ కపూర్‌లపై ఒక అద్భుత మైన పాటను చిత్రీకరిం చనున్నారు. ఆస్కార్ అవార్డు విజేత ఏ.ఆర్. రహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. బుచ్చి బాబు సానా అత్యంత ప్రెస్టీజియస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రామ్ చరణ్‌ను పూర్తి గా కొత్త లుక్‌లో, ఇప్పటివరకూ ఎన్నడూ చూడని గెటప్‌లతో ప్రజెంట్ చేస్తున్నారు. రామ్ చరణ్ ఈ పాత్ర కోసం కంప్లీట్ మేకోవర్స్ అవుతూ హై ఆక్టేన్ స్టంట్స్ చేయబోతున్నారు.

# 'పోయేకాలం నీకు' లిరికల్ సాంగ్

మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా "స్కై". పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న "స్కై" సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'పోయేకాలం నీకు..' అనే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటకు పృథ్వీ పెరిచెర్ల లిరిక్స్ రాయగా, యదు కృష్ణన్ వల్లవన్ పాడారు. శివప్రసాద్ క్యాచీ ట్యూన్ తో కంపోజ్ చేశారు. 'పోయేకాలం నీకు..' పాట ఎలా ఉందో చూస్తే - 'పోయేకాలం నీకు ముందుందని చెబుతుంటే, సచ్చి పోతున్నారు వినవే వినను అంటుంటే, రాంగే రైటై పోదని చెబుతూ నేను ఉంటున్నా, రైటే రైటంటు వేగంగా నువ్వు పోతున్నావ్, నీకోసం పోరి వస్తుంటే పో పో పొమ్మని తరిమే శావ్, చాల్లే నీకు నా గొడవే, ఎందుకు లే నన్ను వదిలేసెయ్..' అంటూ సాగుతుందీ పాట. "స్కై" చిత్రం నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన 'తపనే తెలుపగ..' సాంగ్ ప్రేక్షకాదరణ పొంది మిలియన్ వ్యూస్ రీచ్ అయింది, ఇప్పుడు ఈ 'పోయేకాలం నీకు..' సాంగ్ కు కూడా మంచి రెస్పాన్స్ వస్తుందని మేకర్స్ బావిస్తున్నారు.



# మోగ్లీ 2025లో 'సయ్యారే'

బబుల్గమ్‌తో సక్సెస్ ఫుల్ డెబ్యు చేసిన యంగ్ హీరో రోషన్ కనకాల తన సెకండ్ మూవీ 'మోగ్లీ 2025' తో వస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, కలర్ ఫోటో ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన మోగ్లీ 2025 అడవి నేపథ్యంలో యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామా. ఈ సినిమా గ్లింప్స్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. మేకర్స్ ఫస్ట్ సింగిల్ సయ్యారేను విడుదల చేసి మ్యూజిక్ జర్నీ ప్రారంభించారు. కాల భైరవ అందమైన ఆర్కెస్ట్రేషన్ తో అద్భుతమైన ట్యూన్ ను కంపోజ్ చేశారు. ఆస్కార్ విన్నర్ చంద్ర బోస్ హార్ట్ టచ్చింగ్ లిరిక్స్ అందించారు. ఈ పాట చెవిటి, మూగ అమ్మాయి, సౌండ్ నిరోధించే డివైజ్ ని ధరించి తన వినికిడి సామర్థ్యాన్ని త్యాగం చేయడానికి నిర్ణయించుకున్న అబ్బాయి చుట్టూ తిరుగుతుంది. ఎమోషనల్ అతను ఆమెకు ఒక లేఖ రాస్తాడు, ఆమెను ప్రేమిస్తానని ప్రామిస్ చేస్తాడు. ఐశ్వర్య దారురితో కలసి కాల భైరవ స్వయంగా ఈ పాటకు సోల్ ఫుల్ వోకల్స్ అందించాడు. రోషన్ కనకాల మెచ్యూర్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్నాడు. సాక్షి మడోల్కర్‌తో అతని ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ఎట్రాక్టివ్‌గా వుంది. అద్భుతమైన కంపోజిషన్, అర్థవంతమైన సాహిత్యం, సోల్ ఫుల్ వోకల్స్ తో సయ్యారే సాంగ్ సినిమా మ్యూజిక్ జర్నీకి పర్ఫెక్ట్ బిగినింగ్. ఈ సినిమాలో బండి సరోజ్ కుమార్ విలన్ పాత్రలో నటించగా, హర్ష చెముడు కీలక పాత్ర పోషిస్తున్నారు.



# శ్రీ విష్ణుతో నయన్



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు యూనిక్ అండ్ ఎక్సయిటింగ్ సబ్జెక్ట్స్ చేస్తూ ప్రతి సినిమాతో ప్రేక్షలకు అద్భుతమైన ఎంట ర్‌టైన్‌మెంట్ అందిస్తున్నారు. ప్రస్తుతం కొత్త దర్శకుడు యదు నాథ్ మారుతీరావు దర్శకత్వంలో క్రేజీ ఎంటర్టైనర్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 3గా సుమంత్ నాయుడు జి నిర్మిస్తుండగా హేమ షాలిని ఈ చిత్రాన్ని సమర్పిస్తారు, సుబ్రహ్మణ్యం నాయుడు జి, రామాచారి ఎం సహ నిర్మాతలు. ఈ చిత్రం సక్సెస్ ఫుల్ హీరో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్‌గా నటించనున్నారని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఆమెకు బర్త్ డే విషెష్ అందిస్తూ ఒక స్పెషల్ వీడియోని రివిల్ చేశారు. ఈ వీడియో చాలా ఎంటర్‌టైనింగ్‌గా వుంది. ఈ చిత్రం ఒంగోలు పట్టణం నేపథ్యంలో సాగనుంది. ఈ క్రేజీ ఎంటర్‌టైనర్‌లో శ్రీ విష్ణు హిలేరియస్ క్యారెక్టర్ లో కనిపిస్తారు. తన సిగ్నేచర్ చార్మ్‌తో అలరించనున్నారు. ఈ చిత్రంలో సత్య, బ్రహ్మజీ, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్, గోపరాజు రమణ, ప్రమోదిని కీలక పాత్రల్లో నటించారు.

# సి.వి. కుమార్ దర్శకత్వంలో 'ఎక్స్ వై'



శ్రీ క్రిష్ పిక్చర్స్, శ్రీ ఇంటర్నేషనల్ బ్యానర్లపై రతిక ప్రధాన పాత్రలో సి.వి. కుమార్ తెరకెక్కించిన చిత్రం 'ఎక్స్ వై'. డిఫరెంట్ కంటెంట్‌తో రాబోతోన్న ఈ మూవీకి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ మోషన్ పోస్టర్ చూస్తుంటే ఇదొక ప్రయోగాత్మక చిత్ర మని అర్థం అవుతోంది. కథ ఏంటి? బ్యాక్ డ్రాప్ ఏంటి? అన్న విషయాల్ని రివీల్ చేయకుండా అందరిలోనూ ఆసక్తిని పెంచేలా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. సి.వి. కుమార్ ఎప్పుడూ కూడా పిజ్జా, సూదు కవ్వుమ్, అట్టకత్తి, శరభం, ఇరుది సుట్రు, మాయావన్ లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేస్తూనే ఉంటారు. దర్శక, నిర్మాతగా సి.వి. కుమార్ మరోసారి 'ఎక్స్ వై' అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతో న్నారు. తాజాగా రిలీజ్ చేసిన మోషన్ పోస్టర్‌లో కనిపించిన టీ పోసే బౌల్, కెమెరా, మెదడు, డీఎన్ఏ, ఆ తరువాత రాక్షసుడిలా ఓ రూపాన్ని చూపించడం, ఆపై హీరోయిన్ లుక్ చూపించడం, అక్కడ చుట్టూ గర్భంలో ఉన్న శిశువుల్ని చూస్తుంటే ఇదొక డిఫరెంట్ అండ్ న్యూ కంటెంట్ మూవీ అని అర్థం అవుతోంది. తెలుగు, తమిళ్, మలయాళం ఇలా అన్ని భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి శ్రీకాంత్ కృష్ణ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాకి హరిహరణ్ ఆనందరాజ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే చిత్రానికి సంబంధించిన ఇతర వివరాల్ని ప్రకటించనున్నారు.

# టి వి డైరెక్టర్ ప్రియాంకని కలిసిన టెలివిజన్ ప్రముఖులు

తెలుగు టెలివిజన్ పరిశ్రమ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రదాన సమస్యలకు, పరి ష్కార దిశగా టి వి పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు, కార్మికులు తెలంగాణా రాష్ట్ర చలన చిత్ర టి వి నాటక రంగ సమాచార్ భవన్‌లో సంస్థ మనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ప్రియాంక ఐఎఎస్‌తో సమావేశం జరిగింది. ఈ సమావేశం లో సంస్థ ఎక్సి క్యూటివ్ డైర క్టర్ కిషోర్ బాబు కూడా పాల్గొ న్నారు. తెలుగు టెలివిజన్ వర్కర్స్, టెక్నీషియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ నాగబాల సురేష్ కుమార్ సారధ్యంలో జరి గిన సమావేశానికి టి. వి. నటి నటులు, అశోక్‌కు మార్, జి.యల్ శ్రీనివాస్, లహరి, మధు ప్రియ, మాణిక్, నటి సూర్య కళ, దర్శకులు- రచయిత సంఘం అధ్యక్షులు శ్రీ ప్రేంరాజ్, నరేంద్ర, తెలుగు తెలంగాణా సినీ టివి నటి నటుల సంఘం అధ్యక్షులు రాజ్ శేఖర్, గోపాల కృష్ణ, యం.ఎస్. ప్రసాద్, చిత్తరం జన్ దాస్, సినీ.టి.వి గేయ రచయిత వెనిగళ్ళ రాంబాబు, సత్యం యాబి మాస్టారు, అక్కినేని శ్రీధర్ లక్ష్మి, డాక్టర్ శ్రీరాందత్తి, శ్రీరామోజు లక్ష్మి నారా యణ, భాస్కర్ల వాసు, నరేందర్ రెడ్డి, ఆర్ డి ఎస్ ప్రకాష్ తది తర షుమారు 60 మంది సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. భారత దేశంలో ప్రస్తుతం తెలుగు టి. వి. రంగ పరిశ్రమ ఎంతో ఉన్నత స్తాయిలో వుంది దూరదర్శన్‌లో అరగంట చిత్రలహరి కార్యక్రమంతో మొదలైన ప్రస్థానం నేడు 148 శాటిలైట్ చానల్స్, 82 యు ట్యూబ్ చానల్స్, 9 ఓటిటి ప్లాట్ ఫాంతో ప్రతి రోజు 180 షూటింగ్‌లతో షుమారు ప్రత్యక్షంగా 20 వేల మంది పరోక్షంగా ఒక లక్షా 26 వేల మందికి ఉపాది కల్పిస్తుంది.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044